
తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
నిజం.. నిర్భయంగా
హైదరాబాద్ | సోమవారం, ఫిబ్రవరి 23, 2026 పేజీలు 8 /aksharagalam.com సంపుటి : 14 సంచిక : 6 వెల : 3/-

## ప్రభుత్వాన్ని పడగొట్టండి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు



జెరూసలెం, మార్చి 2: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాట్లాడుతూ ఖమేనీ ఎంతోకాలం జీవించి లేరనడానికి చాలా సంకేతాలు ఉన్నాయన్నారు. ఆదివారం ఉదయం ఖమేనీ ఉంటున్న స్థావరంపై దాడి చేశామన్నారు. గత 30 ఏండ్లుగా ఖమేనీ ఉగ్రవాదాన్ని ప్రపంచమంతా వ్యాప్తి చేస్తున్నారని, వాళ్ల దేశ ప్రజలనే అనేకి ఇబ్బందులు పెడుతూ దుఃఖంలో ఉంచేవారని, ఇజ్రాయెల్ దేశాన్ని అంతం చేయడానికి నిరంతరం ప్రయత్నించే వారని ఆరోపించారు. ఖమేనీ మృతితో తమ దాడి ఆగదని, దాడులు కొనసాగుతాయని, రానున్న కొద్ది రోజుల్లో ఆ ఉగ్రవాద గడ్డపై ఉన్న వేలాది లక్ష్యాలపై తాము దాడులు చేస్తామని ఆయన తెలిపారు. పాలనను పడగొట్టి మీ భవిష్యత్‌ను ఉజ్వలం చేసుకోవాలని ఆయన ఇరాన్ దేశ పౌరులను కోరారు.



### ఒక్క దెబ్బకు 48 మందిని లేపేశాం: ట్రంప్

- అమెరికా, ఇస్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి
- ఒకేసారి 48 మంది ఇరాన్ అగ్రనేతలను అంతం చేశామన్న ట్రంప్
- ఇస్రాయెల్ సహా గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణి దాడుల పరంపర
- భారత్ నుంచి వెళ్లే 50కి పైగా ఎయిర్ ఇండియా విమానాలు రద్దు


## ఇరాన్ సుప్రీం లీడర్
# ఖమేనీ మరణం

### సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత మృతి

- కుటుంబ సభ్యులతో పాటు ఉన్నతాధికారులు కూడా బలి
- అధికారిక మీడియా ధ్రువీకరణతో దేశవ్యాప్తంగా సంతాపం
- ట్రంప్ ప్రకటనలతో అంతర్జాతీయ ఉద్రిక్తతలు
- అణు కార్యక్రమం నిలిపేవరకు దాడులు కొనసాగుతాయని హెచ్చరిక
- మద్దతుదారుల్లో దుఃఖం.. వ్యతిరేకుల్లో సంబరాలు



### ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా అయతొల్లా అరాఫీ



- పరిపాలన కోసం ముగ్గురు సభ్యులతో ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు
- గార్డియన్ కౌన్సిల్ సభ్యుడిగా అరాఫీకి ఉన్నత అనుభవం



**ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మృతికి సంబంధించిన వార్త ప్రపంచ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. ఇజ్రాయెల్-అమెరికా సంయుక్త వైమానిక దాడుల్లో టెహ్రాన్‌లోని తన నివాసంలో ఖమేనీతో పాటు ఇరాన్ ఆర్మీ చీఫ్, రక్షణ మంత్రి మరియు ఆయన కుటుంబ సభ్యులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఈ పరిణామాన్ని అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక మలుపుగా అభివర్ణించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని నిలిపివేసే వరకు దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు. ఖమేనీ మరణంతో ఇరాన్ ప్రభుత్వం 40 రోజుల పాటు సంతాప దినాలను ప్రకటించగా, దేశవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు ఖమేనీ మద్దతుదారులు ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతినబూనుతుండగా, మరోవైపు ఆయన వ్యతిరేకులు ఈ ఘటనను నియంతృత్వానికి ముగింపుగా భావిస్తూ సంబరాలు చేసుకుంటున్నారు.**

వాషింగ్టన్/దుబాయ్: దశాబ్దాల పాటు ఇరాన్ రాజకీయాలను ప్రభావితం చేసిన సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మృతిపై సంచలన సమాచారం వెలువడింది. ఇజ్రాయెల్‌అమెరికా సంయుక్త వైమానిక దాడుల్లో ఆయన మరణించినట్లు ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించినట్లు వార్తలు చెబుతున్నాయి. టెహ్రాన్‌లోని ఆయన నివాసాన్ని లక్ష్యంగా చేసుకుని క్షిపణి దాడులు జరిగిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ దాడుల్లో ఖమేనీతో పాటు ఆర్మీ చీఫ్ అబ్దుల్ రహీం ముసావీ, రక్షణ మంత్రి అమీర్ నజీర్‌జాదే సహా పలువురు కీలక నాయకులు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ ఖమేనీ మృతి అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక మలుపుగా మారిందని వ్యాఖ్యానించారు. ఇరాన్ ప్రజలకు దేశాన్ని తిరిగి పునర్వ్యవస్థీకరించుకునే అవకాశం లభించిందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌పై జరుగుతున్న లక్ష్యిత దాడులు మరికొన్ని రోజులు కొనసాగవచ్చని, ముఖ్యంగా అణు కార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేసే వరకు చర్యలు ఆగవని స్పష్టంచేశారు. తమ నిఘా వ్యవస్థల నుంచి ఖమేనీ తప్పించుకోలేకపోయాడని కూడా ఆయన వెల్లడించినట్లు సమాచారం. ఇజ్రాయెల్ వర్గాలు కూడా దాడుల్లో ఇరాన్ ఉన్నత భద్రతా వ్యవస్థకు చెందిన పలువురు కీలక వ్యక్తులు మృతిచెందినట్లు ప్రకటించాయి. సుప్రీం డిఫెన్స్ కౌన్సిల్ సమావేశం జరుగుతున్న సమయంలోనే ఈ దాడులు జరిగినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల తీవ్రతను ఉపగ్రహ చిత్రాలు సూచిస్తున్నాయని, నివాస సముదాయం భారీగా ధ్వంసమైందని తెలుస్తోంది. ఈ దాడిలో ఖమేనీ కుటుంబ సభ్యులు కూడా మరణించినట్లు సమాచారం. కుమార్తె, అల్లుడు, మనవరాలు సహా పలువురు కుటుంబ సభ్యులు

(మిగతా 2వ పేజీలో)



## మధ్యప్రాచ్యం ఉద్రిక్తతలపై ప్రధాని మోదీ అత్యవసర సమావేశం

- ఢిల్లీకి రాగానే అత్యవసరంగా సమావేశం కానున్న ప్రధాని మోదీ
- పశ్చిమాసియాలో ఉద్రిక్తత నేపథ్యంలో సీసీఎస్ భేటీ
- ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి వార్తలతో పెరిగిన ఆందోళన
- గల్ఫ్ దేశాల్లోని భారతీయుల భద్రతపై ప్రధానంగా చర్చ
- రక్షణ, హోం, విదేశాంగ, ఆర్థిక మంత్రులతో కీలక సమీక్ష

రెండు రోజుల రాష్ట్రాల పర్యటన ముగించుకుని ఢిల్లీకి రాగానే ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం రాత్రి అత్యవసర సమావేశం నిర్వహించనున్నారు. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న నేపథ్యంలో.. దేశ అత్యున్నత నిర్ణయాక వ్యవస్థ అయిన భద్రతా వ్యవహారాల

(మిగతా 2వ పేజీలో)

## డీసీసీ శిక్షణ శిబిరానికి ముగింపు

### ::: సంస్థాగత బలోపేతంపై రాహుల్ దిశానిర్దేశం

- రాష్ట్రానికి రానున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత
- అనంతగిరిలో తెలంగాణఏపీ డీసీసీ అధ్యక్షుల శిక్షణా శిబిరం సమాప్తి
- పార్టీ నిర్మాణం, బాధ్యతలపై ప్రత్యేక క్లాస్
- కుటుంబ సభ్యులతో మాటామంతి, ఫొటో సెషన్ కూడా
- సీఎం రేవంత్, పీసీసీ నేతలు పాల్గొననున్న కార్యక్రమం
- 77 మంది డీసీసీ అధ్యక్షులకు మార్గనిర్దేశం
- ఉదయం రాక, సాయంత్రం తిరుగు పయనం



హైదరాబాద్/వికారాబాద్: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం రాష్ట్ర పర్యటనకు రానున్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలోని హరిత రిసార్ట్స్‌లో గత పది రోజులుగా కొనసాగుతున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఈ శిబిరం ద్వారా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం, జిల్లా స్థాయి నాయకత్వానికి స్పష్టమైన దిశానిర్దేశం చేయడం లక్ష్యంగా కాంగ్రెస్ అధిష్టానం

(మిగతా 2వ పేజీలో)



### ఇరాన్-గల్ఫ్ ఉద్రిక్తతల నేపథ్యంలో
## తెలుగువారికి హెచ్చరిక

- భద్రతా సూచనలు తప్పనిసరిగా పాటించాలని సీఎం సూచన
- ఎంబసీలు, కాన్సులేట్‌లతో నిరంతర సంప్రదింపులు అవసరం
- తెలంగాణ ప్రజల పరిస్థితిపై ప్రభుత్వం నిశిత నిగ్రహం
- అత్యవసర పరిస్థితుల్లో రప్పించేందుకు సిద్ధత
- గల్ఫ్ కార్మికులకు ప్రభుత్వం పూర్తి అండ



### ఇరాన్ యుద్ధంలో 'హైదరాబాదీ'ల విలవిల..
## టెన్షన్‌లో 900 మంది విద్యార్థులు

- ఫోన్లు పనిచేయక పేరెంట్స్ కన్నీరు
- సురక్షితంగా వెనక్కి తీసుకురావాలని ప్రభుత్వానికి వేడుకోలు
- మరో 2 వేల మంది తెలంగాణ పౌరులు

హైదరాబాద్: పశ్చిమ ఆసియాలో రేగుతున్న యుద్ధ జ్వాలలు హైదరాబాద్‌లోని వందలాది కుటుంబాల్లో భయాందోళనలు రేకెత్తించాయి. ఇరాన్ పై ఇజ్రాయెల్ జరిపిన మెరుపు దాడుల నేపథ్యంలో అక్కడ చదువుకుంటున్న హైదరాబాద్‌కు చెందిన సుమారు 900 మంది విద్యార్థులు ఇప్పుడు ప్రాణభయంతో వణికిపోతున్నారు. ప్రధానంగా టెహ్రాన్, కుమ్ వంటి నగరాల్లో ఎంబీబీఎస్, ఇతర ఉన్నత చదువుల కోసం వెళ్ళిన విద్యార్థులు యుద్ధం మధ్యలో చిక్కుకుపోయారు.

**తల్లిదండ్రుల ఆందోళన..**

హైదరాబాద్‌లోని పాతబస్తీ, టోలీచౌకి, నాంపల్లి వంటి ప్రాంతాల నుంచి వెళ్ళిన విద్యార్థుల ఆచూకీ తెలియక వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. యుద్ధం కారణంగా ఇరాన్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేయడంతో పాటు మొబైల్ నెట్‌వర్క్‌పై కూడా ఆంక్షలు విధించింది. దీంతో గత 24 గంటలుగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అందుబాటులోకి రాలేకపోతున్నారు. "మా పిల్లల ఫోన్లు కలవడం లేదు.. వాళ్ళు ఎక్కడ ఉన్నారో, ఎలా ఉన్నారో తెలియక ఆందోళన చెందుతున్నాం"

(మిగతా 2వ పేజీలో)

# ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణం



**ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా అయతొల్లా అరాఫీ**

**అమెరికా ఇజ్రాయెల్ వైమానిక దాడిలో ఖమేనీ మృతి**

**ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా అలిరెజా అరాఫీ నియామకం**

**పరిపాలన కోసం ముగ్గురు సభ్యులతో ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు**

**గార్డియన్ కౌన్సిల్ సభ్యుడిగా అరాఫీకి ఉన్నత అనుభవం**

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణంతో ఆ దేశం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన వారసుడిగా అయతొల్లా అలిరెజా అరాఫీని ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా ఆదివారం నియమించింది. టెహ్రాన్‌లోని నివాసంపై అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఖమేనీ మరణించినట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. ఇస్లామిక్ విప్లవ నేత ఖొమేనీ మరణం తర్వాత, 1989 నుంచి ఖమేనీ ఇరాన్ అత్యున్నత నాయకుడిగా కొనసాగుతూ వచ్చారు. ఖమేనీ మరణం తర్వాత దేశ పాలనా వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, జ్యుడీషియరీ చీఫ్ గులాంహొస్సేన్ మొహసెని ఎజెయి, గార్డియన్ కౌన్సిల్ జ్యూరిస్ట్ ఉంటారని 'ఐఆర్ఎన్ఏ' (ఐఆర్ఎన్ఏ) వార్తా సంస్థ తెలిపింది. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం, 88 మంది సభ్యులున్న అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ తదుపరి పూర్తిస్థాయి సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే వరకు ఈ కౌన్సిల్ బాధ్యతలు నిర్వహిస్తుంది. రష్యన్ మీడియా సంస్థ 'ఆర్టీ' (ఆర్టీ) కథనం ప్రకారం.. 1959లో ఇరాన్‌లోని మేబోద్‌లో జన్మించిన అయతొల్లా అరాఫీ, షియా మతగురువుగా, ఇస్లామిక్ న్యాయనిపుణుడిగా పేరు పొందారు. 2016 నుంచి ఇరాన్ ఇస్లామిక్ సెమినరీస్ మేనేజ్‌మెంట్ సెంటర్ హెడ్‌గా, ప్రఖ్యాత కోమ్ సెమినరీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. దేశ చట్టాలను, ఎన్నికలను పర్యవేక్షించే శక్తివంతమైన గార్డియన్ కౌన్సిల్‌లో కూడా ఆయన సభ్యుడిగా ఉన్నారు. గతంలో 2008 నుంచి 2018 వరకు అల్–ముస్తఫా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రెసిడెంట్‌గా కూడా అరాఫీ పనిచేశారు.

ప్రాణాలు కోల్పోయినట్లు అధికారిక వర్గాలు తెలిపినట్లు వార్తలు వెల్లడిస్తున్నాయి. దేశ అత్యున్నత నాయకుడు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఇరాన్ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. శత్రుదేశాలపై ప్రతీకారం తప్పదని కేబినెట్ సభ్యులు హెచ్చరించారు. ఖమేనీ మరణంతో దేశవ్యాప్తంగా 40 రోజులపాటు సంతాప దినాలు పాటించాలని ఇరాన్ ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఆయన స్మారకార్థం వారం రోజులపాటు అధికారిక సెలవులు ప్రకటించగా, అనేక ప్రాంతాల్లో నల్ల జెండాలు ఎగురవేసి ప్రజలు దుఃఖాన్ని వ్యక్తం చేశారు. షియా ముస్లింలకు పవిత్ర క్షేత్రంగా భావించే మషాద్‌లోని ఇమామ్ రెజా మసీదు వద్ద కూడా సంతాప సూచక కార్యక్రమాలు నిర్వహించారు. ఒకవైపు ఆయన మద్దతుదారులు తీవ్ర శోకంలో మునిగిపోయారు. ఖమేనీ చిత్రాలతో ర్యాలీలు నిర్వహిస్తూ అమెరికా, ఇజ్రాయెల్‌లపై ఆగ్రహ నినాదాలు చేశారు. శత్రువులపై ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతిజ్ఞలు చేశారు. దేశ స్వాభిమానంపై దాడి జరిగిందని వారు ఆరోపించారు. మరోవైపు ఖమేనీ పాలనను వ్యతిరేకించిన వర్గాలు మాత్రం భిన్నంగా స్పందించాయి. ఆయన మరణాన్ని నియంతృత్వానికి ముగింపు అని పేర్కొంటూ కొందరు వీధుల్లోకి వచ్చి సంబరాలు జరుపుకున్నట్లు సమాచారం. స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాటానికి ఇది కొత్త దశ అని వారు వ్యాఖ్యానించారు. ఇలా ఒకే ఘటనపై ఇరాన్‌లో విభిన్న భావోద్వేగాలు వ్యక్తమవుతూ, దేశ రాజకీయ భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొన్న పరిస్థితి కనిపిస్తోంది.

# ఒక్క దెబ్బకు 48 మందిని లేపేశాం: ట్రంప్

**అమెరికా, ఇస్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి**


**ఒకేసారి 48 మంది ఇరాన్ అగ్రనేతలను అంతం చేశామన్న ట్రంప్**

**ఇస్రాయెల్ సహా గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణి దాడుల పరంపర**

**భారత్ నుంచి వెళ్లే 50కి పైగా ఎయిర్ ఇండియా విమానాలు రద్దు**



"ఒక్క దెబ్బకు 48 మంది ఇరాన్ అగ్రనేతలను లేపేశాం.. ఇది మాకు అద్భుత విజయం" అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటన చేశారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. మార్చి 1 నాటికి పరిస్థితి చేజారిపోయి, పూర్తిస్థాయి యుద్ధ వాతావరణం నెలకొంది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' ఇరాన్ గుండెల్లో గుబులు రేపింది. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడం ఇరాన్ చరిత్రలోనే అతిపెద్ద విషాదంగా మారింది. టెహ్రాన్ నడిబొడ్డున అమెరికా, ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడ్డాయి. దాదాపు 1,200కు పైగా బాంబులు, ఆయుధ సామగ్రితో ఇరాన్‌పై దాడి చేశాయి. ఈ విధ్వంసంలో ఇరాన్ అగ్రనాయకత్వం కుప్పకూలింది. ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఈ దాడి తీవ్రతను కళ్లకు కడుతున్నాయి. ఇరాన్ ఒకవేళ ప్రతీకారానికి దిగితే, ఇంతకంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా ఇది తమ ఉనికి కోసం జరుగుతున్న యుద్ధమని, దాడులను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అయితే, తమ నాయకుడి మరణంతో రగిలిపోతున్న ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. ఇజ్రాయెల్‌లోని బీట్ షెమెష్‌పై బాలిస్టిక్ మిస్సైల్స్‌తో దాడి చేయడంతో 8 మంది మరణించారు. అటు గల్ఫ్ జలాల్లోని ఇంధన ట్యాంకర్లే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో ఓ ట్యాంకర్ పూర్తిగా మునిగిపోగా, మరొకటి ధ్వంసమైంది. ఈ ఘటనలో భారతీయులు కూడా గాయపడటం ఆందోళన కలిగిస్తోంది. దుబాయ్, అబుదాబి, దోహా వంటి ప్రధాన నగరాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మరోవైపు, ఇరాన్ తన క్షిపణులతో అమెరికా యుద్ధ నౌక 'యూఎస్ఎస్ అబ్రహం లింకన్'పై దాడి చేశామని ప్రకటించుకుంది. అయితే అమెరికా సెంట్రల్ కమాండ్ ఈ వార్తలను ఖండించింది. ఇరాన్ క్షిపణులు తమ దరిదాపుల్లోకి కూడా రాలేదని కొట్టిపారేసింది. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్‌లో తాత్కాలిక పాలక మండలి ఏర్పాటైంది. అయతోల్లా అలిరెజా అరాఫీని తాత్కాలిక సుప్రీం లీడర్‌గా నియమించారు. ఈ యుద్ధ ప్రభావం సామాన్యులపైనా తీవ్రంగా పడుతోంది. పాకిస్థాన్‌లోని అమెరికా కాన్సులేట్ వద్ద జరిగిన నిరసనల్లో 9 మంది మరణించారు. యుద్ధం కారణంగా గగనతలం మూసివేయడంతో విమానయాన రంగం కుదేలయ్యింది. భారత్ నుంచి వెళ్లాల్సిన 50కి పైగా ఎయిర్ ఇండియా విమానాలు, ఢిల్లీ ఎయిర్‌పోర్టులో 100కు పైగా సర్వీసులు రద్దయ్యాయి. రష్యా, చైనా ఈ దాడులను ఖండించగా... పరిస్థితి ఇంకా ఏ మలుపు తిరుగుతుందోనని ప్రపంచం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది.



## ఇరాన్ యుద్ధంతో ఇండియాకు కష్టాలు

పశ్చిమ ఆసియాలో రాజుకున్న యుద్ధ జ్వాలలు ఇప్పుడు భారత ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయి. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దాడుల తర్వాత నెలకొన్న ఉద్రిక్తతలు ప్రధానంగా రెండు రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి: ఒకటి పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగేలా చేస్తున్న ముడి చమురు, రెండోది భారత రైతుల ఆదాయానికి మూలమైన బాస్మతి బియ్యం ఎగుమతులు.

**బాస్మతి బియ్యం ఎగుమతులు..**

భారతదేశం నుంచి ఎగుమతయ్యే బాస్మతి బియ్యానికి ఇరాన్ అతిపెద్ద కొనుగోలుదారు. యుద్ధం ప్రారంభం కావడానికి రెండు నెలల ముందే ఇరాన్ వ్యాపారులు భారీగా ఆర్డర్లు ఇచ్చారు. దీంతో భారత మార్కెట్లో బాస్మతి బియ్యం ధర కిలోకు రూ.10 పెరిగింది. అయితే, ఇప్పుడు యుద్ధం కారణంగా ఈ ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. భారత్ ఎగుమతి చేసే మొత్తం బాస్మతి రైస్ లో 25% ఇరాన్‌కు, 20% ఇరాక్‌కు వెళ్తాయి. సుమారు $2 బిలియన్ల (రూ. 16,000 కోట్లకు పైగా) విలువైన 20 లక్షల టన్నుల బియ్యం వ్యాపారం ఇప్పుడు ప్రమాదంలో పడింది. ప్రస్తుతం సముద్ర మార్గంలో ఉన్న షిప్‌మెంట్ల డెలివరీ తీసుకోవడానికి ఇరాన్ వ్యాపారులు వస్తారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**చమురు దిగుమతులకు ముప్పు..**

భారతదేశం తన ముడి చమురు అవసరాల కోసం 40 దేశాలపై ఆధారపడుతున్నప్పటికీ 50% దిగుమతులు పశ్చిమ ఆసియా నుంచే వస్తున్నాయి. ముఖ్యంగా ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ నుంచి వచ్చే చమురు 'హోర్ముజ్ జలసంధి' గుండానే రావాలి. ప్రపంచ చమురు సరఫరాలోనూ 25% ఈ మార్గం నుంచే జరుగుతుంది. యుద్ధం కారణంగా ఈ జలసంధి మూతపడితే భారత్‌కు రోజుకు వచ్చే 25–27 లక్షల బ్యారెళ్ల చమురు సరఫరా నిలిచిపోతుంది. గల్ఫ్ నుంచి అయితే కేవలం 5–7 రోజుల్లో చమురు వస్తుంది. అదే అమెరికా, లాటిన్ అమెరికా నుంచి చమురు తెప్పించుకోవాలంటే 25 నుంచి 45 రోజులు పడుతుంది. దీనివల్ల రవాణా ఖర్చులు పెరిగి దేశంలో ఇంధన ధరలు భగ్గుమనే అవకాశం ఉంది.

## ఇరాన్-గల్ఫ్ ఉద్రిక్తతల నేపథ్యంలో తెలుగువారికి హెచ్చరిక

**భద్రతా సూచనలు తప్పనిసరిగా పాటించాలని సీఎం సూచన**

**ఎంబసీలు, కాన్సులేట్‌లతో నిరంతర సంప్రదింపులు అవసరం**

**తెలంగాణ ప్రజల పరిస్థితిపై ప్రభుత్వం నిశిత నిగ్రహం**

**అత్యవసర పరిస్థితుల్లో రప్పించేందుకు సిద్ధత**

**గల్ఫ్ కార్మికులకు ప్రభుత్వం పూర్తి అండ**



హైదరాబాద్, మార్చి 1: అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్‌తో పాటు గల్ఫ్ ప్రాంత దేశాల్లో నివసిస్తున్న తెలుగు ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. యుద్ధ పరిస్థితులపై వస్తున్న సమాచారం దృష్ట్యా అక్కడి భద్రతా పరిస్థితులను నిర్లక్ష్యం చేయకుండా, స్థానిక అధికారుల మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ పరిణామాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి, విదేశాల్లో ఉన్న తెలంగాణ వాసుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు, కాన్సులేట్‌లు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనించి వాటిని అనుసరించాలని ప్రత్యేకంగా పేర్కొన్నారు. అవసరమైతే వెంటనే అధికారిక సంస్థలతో సంప్రదింపులు జరపాలని కూడా సూచించారు. ఇరాన్ సహా ఇతర గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలంగాణ ప్రజల పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తున్నదని ఆయన తెలిపారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అక్కడి తెలుగు ప్రజలను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి ముఖ్యమని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, విదేశాల్లో ఉన్న వారు స్థానిక పరిస్థితులపై అప్రమత్తంగా ఉండటంతో పాటు భారత ఎంబసీలు, కాన్సులేట్‌లతో సంప్రదింపులు కొనసాగించాలని అధికారులకు కూడా సీఎం దిశానిర్దేశం చేశారు. తెలంగాణ ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇక గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న కార్మికుల కుటుంబాలు ఆందోళన చెందవద్దని నాయకులు భరోసా ఇచ్చారు. అవసరమైతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చర్యలు తీసుకుని తెలుగువారిని సురక్షితంగా స్వదేశానికి రప్పించే ఏర్పాట్లు చేస్తాయని తెలిపారు. గల్ఫ్ కార్మికులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని, వారి సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని పేర్కొన్నారు.

## మధ్యప్రాచ్యం ఉద్రిక్తతలపై ప్రధాని మోదీ అత్యవసర సమావేశం

కేబినెట్ కమిటీ (సీసీఎస్)తో ఆయన భేటీ కానున్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా వైమానిక దాడులు చేయడం, ఇదే సమయంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించడంతో గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఈ పరిణామాల దృష్ట్యా భారత్ అప్రమత్తమైంది. రాజస్థాన్, గుజరాత్, తమిళనాడు, పుదుచ్చేరి పర్యటనలు ముగించుకుని రాత్రి 9:30 గంటల సమయంలో ప్రధాని ఢిల్లీ చేరుకుంటారు. వచ్చిన వెంటనే రక్షణ, హోం, విదేశాంగ, ఆర్థిక శాఖ మంత్రులతో కూడిన సీసీఎస్ బృందంతో సమావేశమవుతారు. ఈ అత్యవసర భేటీలో ప్రధానంగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, భారత్‌పై వాటి ప్రభావం గురించి చర్చించనున్నారు. ముఖ్యంగా యూఏఈ, ఇతర గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయుల భద్రత, ఇంధన భద్రత (చమురు ధరలు), సముద్ర వాణిజ్య మార్గాల రక్షణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. అవసరమైతే భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు (ఎవాక్యుయేషన్) తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపైనా చర్చ జరగనుంది. అంతర్జాతీయంగా పరిస్థితులు వేగంగా మారుతున్న వేళ.. దేశ ప్రయోజనాలను కాపాడేందుకు, వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకునేందుకు మోదీ సర్కార్ ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది.

## డీసీసీ శిక్షణ శిబిరానికి ముగింపు


చర్యలు చేపట్టింది. శిక్షణ పొందిన డీసీసీ అధ్యక్షులకు పార్టీ సిద్ధాంతాలు, బాధ్యతలు, భవిష్యత్ కార్యాచరణపై రాహుల్ గాంధీ ప్రత్యేకంగా మార్గనిర్దేశం చేయనున్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడం, కేడర్ సమన్వయం, ప్రజా సమస్యలపై స్పందన వంటి అంశాలపై ఆయన విస్తృతంగా మాట్లాడనున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సభ్యులతో కూడా సమావేశమై సమకాలీన రాజకీయ పరిస్థితులపై చర్చించనున్నారు. శిబిరంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుల కుటుంబ సభ్యులను కూడా కార్యక్రమానికి ఆహ్వానించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. వారితో అనౌపచారికంగా మాట్లాడటంతో పాటు ఫొటో సెషన్‌లో కూడా రాహుల్ పాల్గొననున్నారు. నాయకత్వం, కుటుంబాల మధ్య సాన్నిహిత్యాన్ని పెంపొందించే దిశగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తదితరులు హాజరవుతారు. అలాగే రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, సంగతన్ సృజన్ అభియాన్ జాతీయ ఇన్‌చార్జి చల్లా వంశీచందర్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు సంపత్‌కుమార్, విశ్వనాథన్, సచిన్ సావంత్ తదితర కీలక నేతలు కూడా పాల్గొంటారు. టీపీసీసీ శిక్షణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించబడింది. తెలంగాణ నుంచి 36 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 41 మంది కలిపి మొత్తం 77 మంది డీసీసీ అధ్యక్షులు ఈ శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు. పది రోజులపాటు సాగిన ఈ కార్యక్రమంలో పార్టీ నిర్మాణాత్మక వ్యూహాలు, ఎన్నికల నిర్వహణ, ప్రజా ఉద్యమాల రూపకల్పన వంటి అంశాలపై విస్తృత శిక్షణ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## ఇరాన్ యుద్ధంలో 'హైదరాబాదీ'ల విలవిల.. టెన్షన్‌లో 900 మంది విద్యార్థులు

అంటూ పలువురు తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. విద్యార్థులే కాకుండా, ఇంజనీర్లు, వ్యాపారులు, వివిధ పనుల నిమిత్తం వెళ్ళిన వారు కలిపి మొత్తం తెలంగాణ నుంచి సుమారు 2 వేల మంది ఇరాన్‌లో ఉన్నట్లు సమాచారం. వీరిలో ఎక్కువ మంది హైదరాబాద్ నగరానికి చెందిన వారే. సాధారణంగా హైదరాబాద్ నుంచి ఇరాన్ దేశానికి రాకపోకలు ఎక్కువగా ఉంటాయి, కానీ ప్రస్తుత యుద్ధ వాతావరణం ఈ సంబంధాలను అతలాకుతలం చేసింది.

**భారత ప్రభుత్వం హెల్ప్‌లైన్**

భారత రాయబార కార్యాలయం ఇప్పటికే ఒక అడ్వైజరీ జారీ చేస్తూ.. భారతీయులందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, అనవసరంగా బయటకు రావద్దని సూచించింది. తెలంగాణ ప్రభుత్వం కూడా విదేశాంగ శాఖతో సమన్వయం చేసుకుంటూ, చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది.



## యూఏఈపై 137 బాలిస్టిక్ క్షిపణులు, 209 డ్రోన్లతో ఇరాన్ దాడి

మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ మరణించినట్టు ఇరాన్ ప్రభుత్వ మీడియా ఆదివారం ధ్రువీకరించింది. ఇదే సమయంలో, ఇరాన్ ప్రయోగించిన వందలాది క్షిపణులు, డ్రోన్లతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)పై భీకర దాడి జరిగింది. ఈ పరిణామాలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. యూఏఈపై ఇరాన్ మొత్తం 137 బాలిస్టిక్ క్షిపణులు, 209 డ్రోన్లతో దాడి చేసిందని, వాటిలో చాలా వరకు విజయవంతంగా అడ్డుకున్నామని యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. 132 క్షిపణులను గాల్లోనే ధ్వంసం చేయగా, 195 డ్రోన్లను కూల్చివేసినట్టు తెలిపింది. మిగిలినవి సముద్రంలో, దేశంలోని వివిధ ప్రాంతాల్లో పడ్డాయని పేర్కొంది. ఈ దాడుల శిధిలాలు అబుదాబి, దుబాయ్‌లలో పడటంతో నష్టం వాటిల్లింది. అబుదాబిలోని జాయెద్ అంతర్జాతీయ విమానాశ్రయం లక్ష్యంగా వచ్చిన డ్రోన్‌ను అడ్డుకునే క్రమంలో దాని శకలాలు కిందపడి ఆసియా దేశానికి చెందిన ఒకరు మరణించగా, మరో ఏడుగురు గాయపడ్డారు. దుబాయ్‌లోని పామ్ జుమేరా ప్రాంతంలో ఓ భవనంపై క్షిపణి శిధిలాలు పడటంతో నలుగురు గాయపడ్డారు. ఈ దాడుల వల్ల విమాన రాకపోకలకు అంతరాయం కలిగి, సుమారు 20,200 మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అధికారులు తెలిపారు. మరోవైపు, ఖమేనీ మరణంతో ఇరాన్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనతో పాటు మరో నలుగురు కుటుంబసభ్యులు కూడా ఈ దాడుల్లో మరణించినట్టు ఫార్స్ న్యూస్ ఏజెన్సీ రిపోర్ట్ చేసింది. ప్రభుత్వం 40 రోజుల సంతాప దినాలను ప్రకటించింది.

# ప్రపంచానికే ఆదర్శనీయుడు బాబాసాహెబ్ అంబేద్కర్

## జై భీం అంటే కులం కాదు ఉద్యమ నినాదం

## రాజకీయ పార్టీలు ఏవైనా ప్రజా నాయకుడు అంబెడ్కరుడు ఒక్కరే.

## 212వ వారం జ్ఞానమాల కార్యక్రమం ముఖ్య అతిథిగా మూడుచింతలపల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకులు జెర్రిపోతుల నర్సింహులు







కీసర,మార్చి 01,(అక్షర గళం) : ప్రపంచానికే ఆదర్శనీయుడు బాబాసాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన ఉద్యమ నినాదం జై భీం... కానీ అది నేడు ఓ కులానికి పరిమితం అయ్యేలా కొందరు అపాదిస్తుండటం సరికాదని విషయం బహుజనులందరు గమనించాలని ఉమ్మడి షామీర్ పెట్ మండలం మూడుచింతలపల్లి మున్సిపల్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు,4వ వార్డు కంటస్టడ్ కౌన్సిలర్ అభ్యర్థి జెర్రిపోతుల నర్సింహులు పిలుపునిచ్చా రు. కీసర మండల అంబెద్కర్ సంఘం ఆధ్వర్యంలో 212వ వారం జ్ఞానమాల కార్యక్రమం విజయవంతమైంది.మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కర్రె గణేష్, ప్రధాన కార్యదర్శి మంచాల సంజీవ,కమిటీ సభ్యులు ముఖ్య అతిధికి బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటం జ్ఞాపికగా అందించారు. భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించి మాట్లాడారు... ప్రపంచమే గర్వించేలా సమాన హక్కులను భారత దేశ ప్రజలకు కల్పించిన మహాయోధుడు బాబాసాహెబ్ అంబేద్కర్ అని కొనియాడారు. ఎన్నికలు ఏవైనా దేశప్రజల తలరాతలు మార్చే ఓటును నోటు కోసం అమ్ముకొని బానిసలు కావద్దని అన్నారు. మూడుచుచింతలపల్లిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో తాను స్వల్ప మెజారిటీతో ఓడిన తన ఓటర్లకు ఇచ్చిన హామీలు బంగారు మైసమ్మ ఆలయ నిర్మాణం, వినాయక మండపాల ఏర్పాటు చేస్తున్నట్లు గుర్తుచేశారు. రాజకీయ పార్టీలు ఏవైనా ప్రజలందరికీ మార్గదర్శకుడు గా కనిపించే ఏకైక నాయకుడు అంబేద్కర్ ఒక్కరు మాత్రమేనని గుర్తుచేసుకోవాలన్నారు. కీసర మండలంలో ప్రతివారం అంబేద్కర్ కి నివాళి కార్యక్రమం నిర్వహిస్తూ అందరిమన్నలను పొందుతుండటం శుభపరిణామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు గోరంటి ప్రవీణ్, పులిపాక తిరుపతి, బొల్లి మహేష్, కోశాధికారి రొండ్ల మహేష్, సంయుక్త కార్యదర్శిలు సుమన్ బన్నీ, తాళ్ళ కిరణ్, మంచాల మహేష్, కుర్రి పరమేష్, మండల మాజీ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మొరుగు రవీందర్, ముఖ్య సలహాదారులు చినింగని ఆనంద్ రావు, మంగళపురి వెంకటేష్, రాగుల రమేష్ ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర మార్వాడి సంఘం అధ్యక్షులు మోహన్ లాల్ చౌదరి, మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బెలిదే రమేష్ గుప్తా, మూధుచింతల పల్లి యువజన కాంగ్రెస్ అద్యక్షుడు శ్రీకాంత్ గౌడ్ , బిఆర్ ఎస్ కీసర గ్రామశాఖ అధ్యక్షుడు చినింగని బాల్ రాజ్, కీసర గ్రామశాఖ అంబెద్కర్ సంఘం తుడుం బాల్ రాజ్, మొరుగు క్రాంతి కుమార్, మాజీ కోశాధికారి కానుకుంట్ల శ్యామ్ కుమార్, మండల కాంగ్రెస్ మహిళ ఉపాధ్యక్షురాలు కర్రె బాలమని, పుట్ట శ్రీనివాస్ గౌడ్, శీలం సురేష్, ఎర్రోల సాయిలు పలువురు పాల్గొన్నారు.

# గ్రేటర్ హైదరాబాద్‌ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలందరికీ సహకారం అవసరం

### ::: సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్




అక్షర గళం, కూకట్ పల్లి : గ్రేటర్ హైదరాబాద్ ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలందరికీ సహకారం అవసరమని సీపీఎం పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపూర్ రాజశేఖర్ అన్నారు. కూకట్పల్లి నియోజకవర్గం లోని బాలానగర్ మండలం దిల్ కుష్ నగర్ లో ఆదివారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేశారు ఈ కార్యక్రమం లో సీపీఎం పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపూర్ రాజశేఖర్ పాల్గొని మాట్లాడుతూ జిహెచ్ఎంసి ఇంటింటి చెత్త సేకరణ విషయంలో డబ్బులు ఇస్తే కానీ చెత్త తీసుకుపోము అనే విధంగా సామాన్య ప్రజలపై ఒత్తిడి చేస్తున్న జిహెచ్ఎంసి రెగ్యులర్గా ప్రతి సంవత్సరం ప్రాపర్టీ టాక్స్ వసూలు చేస్తూనే చెత్త సేకరణ విషయంలో ప్రతి ఇంటికి 150 రూపాయలు ఇస్తేనే చెత్త తీసేస్తాం లేకుంటే తీసుకుపోము అనడంతో సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. చెత్తను బయట డస్ట్ బిన్ లో వేద్దామంటే ఆ ప్రాంతంలో చెత్త పడేయడానికి డస్ట్ బిన్ ఏర్పాట్లు లేవు దిల్ క్రిష్ నగర్ లో దాదాపు 430 కుటుంబాల దాకా ఉంటారు మొత్తం గ్రేటర్ హైదరాబాద్ లోనే చెత్త సేకరణ విషయంలో పేద ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి జిహెచ్ఎంసి చెత్తను తీసివేస్తుందన్నారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించే కార్మికులకు జిహెచ్ఎంసి జీతాలు ఇవ్వకుండా పేద ప్రజల నుంచి వసూలు చేసుకోమని జిహెచ్ఎంసి చెప్పడం అనేది పేద ప్రజలను దోచుకోవడమే అని అన్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూనే డస్ట్ బిన్లు ఏర్పాటు చేసి రెగ్యులర్గా క్లీన్ చేసే ప్రయత్నం చేయాలనంనారు. ఇంటింటికి డబ్బులు వసూలు చేసే పద్ధతినే నిలిపివేయాలన్నారు. ఆ కార్మికులకు జిహెచ్ఎంసి జీతాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యురాలు ఏ.విజయ, నవ్య, సువర్ణ, ఎల్లమ్మ, కళ్యాణి, కరుణ, మాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

### ::: జడ్జి కాటం స్వరూప





ఆమనగల్లు, మార్చి 01 (అక్షర గళం): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆమనగల్లు సివిల్ కోర్టు జడ్జి కాటం స్వరూప అన్నారు. పట్టణ కేంద్రంలోని వివేక విద్యా భారతి పాఠశాల వార్షికోత్సవ వేడుకలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జడ్జి కాటం స్వరూప, రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ (డీజీ) ఆఫ్ ఎన్.సీ.సీ సరోజ బాల ఠాగూర్, డాక్టర్ పుల్లయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వివేక విద్యా భారతి విద్యార్థులు చదువుతోపాటు ఆటలలో, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో అన్ని రంగాలలో ప్రతిభ కనబరుస్తున్నారని కొనియాడారు. గతంలో ఇదే పాఠశాలలో చదివి వివిధ ఉన్నత స్థాయిలలో రాణిస్తున్న విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. సాధారణ బడ్జెట్ పాఠశాల స్థాయిలో ఉండి కూడా కార్పొరేట్ పాఠశాలలను మించిన కార్యక్రమాలను నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. మండల స్థాయి, జిల్లా స్థాయి మరియు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చూపర్లను ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు ప్రిన్సిపాల్ మహమూద్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఈసీఐఎల్‌లో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ తరగతులు

కుషాయిగూడ,మార్చి01(అక్షర గళం) : ఈసీఐఎల్ లోని ఎస్సి, ఎస్టి ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకులు విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, శ్రీకాంత్ తెలిపారు. మార్చి 1 నుంచి 30 వరకు నెల రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఈ తరగతులు జరుగనున్నాయని పేర్కొన్నారు.ఈ శిక్షణ కార్యక్రమం ఈసీఐఎల్ చౌరస్తా నుండి ఎన్ఎఫ్‌సీ వెళ్లే రహదారిలో ఎస్‌బీఐ బ్యాంకు పక్కన ఉన్న అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ ఉచిత తరగతులకు విద్యార్థులు,యువత, ఉద్యోగులు,మహిళలు హాజరుకావచ్చని తెలిపారు.ఇంగ్లీష్ మాట్లాడే నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 7842419367, 9951754975, 9866540816నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.



## మాదిగ అమరవీరులు ప్రాణత్యాగం వృధా కాలేదు

### ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు రాసమల్ల యాదగిరి మాదిగ

అక్షర గళం, కుత్బుల్లాపూర్ : మాదిగ అమరవీరులు ప్రాణత్యాగం వృధా కాలేదని ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు రాస మల్ల యాదగిరి మాదిగ అన్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సూరారం మెయిన్ రోడ్డు ఎమ్మార్పీఎస్ జెండా ఆవరణలో మాదిగ అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు రాస మల్ల యాదగిరి మాదిగ పాల్గొని నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరుల ఆశయ సాధనలో 30 ఏళ్ల సుదీర్ఘ అలుపెరగని పోరాటం వల్ల పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధించి పెట్టడం జరిగిందన్నారు. ప్రజా సమస్యలు ఎలాంటి ఉన్న ముందుండే పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అడుగుజాడల్లో నడుస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంఘీ మహేష్ మాదిగ, కనుమూరి కుర్మయ్య మాదిగ, గడ్డం కురుమయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా పాండురంగ విట్టల్ రుక్మిణి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన

అక్షర గళం, కుత్బుల్లాపూర్ : సుభాష్ నగర్ డివిజన్ ఫాక్స్ సాగర్ వద్ద గల పాండురంగ విట్టల్ రుక్మిణి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యాక్రమానికి ముఖ్య అతిథులుగా సుభాష్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్ , సీనియర్ బిఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ వారు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు ఆర్. బలరాం రెడ్డి, దుబాయ్ శీను, సంగీత పాత్ర, గణేష్ పాత్ర, పాండురంగ విట్టల్ రుక్మిణి ఆలయ కమిటీ సభ్యులు అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన

అక్షర గళం, కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బౌరంపేట లో సింధు పార్సిల్ సర్వైసేస్ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ నిఖిల్ స్మారకార్థంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఎన్టీఆర్ ట్రస్ట్ తో కలిసి రక్తదాన శిబిరం కిమ్స్ హాస్పిటల్ తో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేర్లింగంపల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ అధ్యక్షులు కోలాన్ హనుమంత రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ నిఖిల్ మన మధ్య లేకున్నా ఆయన పుట్టినరోజున సేవ కార్యక్రమాలు ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మధ్యతరగతి కుటుంబాలకి విద్య, వైద్యాన్ని అందిస్తు సేవ కార్యక్రమాల రూపంలో మన మధ్యలోనే ఉన్నడని అన్నారు.ఈ కార్యక్రమంలో మియాపూర్ మాజీ కార్పొరేటర్ శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అపూర్వ కలయిక.. జ్ఞాపకాల వేదిక

## 2007-2008 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**వెల్దండ మార్చి 01 (అక్షరగళం) :** వెల్దండ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 2007–2008సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులందరూ వెల్దండ మండల కేంద్రంలోని ఆకృతి గార్డెన్ లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు అందరూ ఒకచోట కలుసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. మండల పరిసర ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా తరలివచ్చారు. సుమారు 19 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం నాడు తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వపు విద్యార్థులు మాట్లాడుతూ.. అందరం ఇలా ఒక్కచోట చేరడం సంతోషంగా ఉందన్నారు. గురువులు చెప్పిన సూచనలు పాటిస్తూనే ఉన్నత స్థానాల్లో ఉన్నామని అందుకు వారికి రుణపడి ఉంటామని తెలిపారు. చివరగా అంతా గ్రూప్ ఫొటోలు కొత్త జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు శ్రీదేవి అనురాధ తారక రామారావు విద్యార్థులు శేఖర్ విష్ణు చిరంజీవి శేఖర్ రోహిత్ తిరుపతమ్మ హసియా లావణ్య తదితరులు పాల్గొన్నారు

# దివ్యాంగుల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నా

### ::: శేరిలింగంపల్లి డివిజన్ మాజి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



అక్షర గళం, శేరిలింగంపల్లి : దివ్యాంగుల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నానని శేరిలింగంపల్లి డివిజన్ మాజి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ హామీ ఇచ్చారు. శేరిలింగంపల్లి డివిజన్ తారానగర్ లోని శ్రీశ్రీశ్రీ తుల్జాభవాని ఆలయం ఆవరణలో నిరాశ్రయులైన ఒంటరి వికలాంగుడికి తన సొంత ఖర్చులతో ఎలక్ట్రిక్ ట్రై సైకిల్ వీల్ చైర్ ను అందజేశారు. అంతకముందు శ్రీశ్రీశ్రీ తుల్జాభవాని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటరి వృద్ధాప్యంలో అందులోను దివ్యంగుడికి శారీరక ఆరోగ్యం కంటే ముఖ్యంగా ప్రేమ, ఆత్మీయత, ఓపిక, మరియు గౌరవం కావాలని అందులో భాగంగా నా వంతు బాధ్యతగా ఎలక్ట్రిక్ ట్రై సైకిల్ వీల్ చైర్ ను అందజేశానని అన్నారు. దివ్యాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించాలన్నదే తన ఉద్దేశమని పేర్కొన్నారు. అనంతరం ఆయనను టెంపుల్ కమిటీ ప్రెసిడెంట్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్, తుల్జాభవాని ఆలయ చైర్మెన్ బీ రాజశేఖర్ రెడ్డి, పవన్, నటరాజ్, రేణుక, శిరీష, సత్యనారాయణ, సత్యం, కిరణ్, బాపునగర్ హనుమాన్ యూత్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్, అంబేద్కర్ భవన్ జనచైతన్య అసోసియేషన్ ప్రెసిడెంట్ రమేష్, సుధాకర్ రెడ్డి, ముసలయ్య, ప్రవీణ్, సందీప్, పప్పు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు.. చిరునవ్వుతో సేవలు



ఆమనగల్లు, మార్చి 01 (అక్షర గళం): బీఆర్ఎస్ కడ్తాల్ మండల అధ్యక్షుడు కంబాల పరమేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నగరంలోని ఎల్బీ నగర్ పరిధిలో ఉన్న అనాథ విద్యార్థి గృహ లో చిన్నారుల నడుమ అట్టహాసంగా జన్మదిన వేడుకలు జరిగాయి. జన్మదిన సందర్భంగా విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం అక్కడ నివసిస్తున్న చిన్నారులకు నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేశారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మమేకమై వారి అభ్యాసం, సంక్షేమం గురించి తెలుసుకున్నారు. సందర్భంగా కంబాల పరమేష్ మాట్లాడుతూ.. సమాజంలో అనాథ విద్యార్థుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమ,ఆప్యాయత చూపాలని, వారి భవిష్యత్తు నిర్మాణానికి తోడ్పడాలని కోరారు. విద్యార్థులు కూడా తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి, అనుమాస్పల్లి సర్పంచ్ డాన్ శ్రీను, వాసుదేవపూర్ ఉపసర్పంచ్ రామకృష్ణ, వార్డు సభ్యులు దేవుల నాయక్,ప్రశాంత్, సిద్ది గారి దాసు,బొర్ర మల్లేష్,శంకర్,భాస్కర్, రమేష్,శేఖర్,శివ,రాజా,శ్రీకాంత్,సాయి,రాఘవేందర్, రాజు,మహేష్,రవి స్థానిక పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ పేద బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటుంది

### ::: కూకట్పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్



అక్షర గళం, కూకట్ పల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ పేద బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటుందని కూకట్పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. బోయిన్పల్లి డివిజన్ కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎన్ శివానంద్ ఆదివారం వందలాది బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో పాటు కూకట్పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గత కొంత కాలంగా బీఆర్ఎస్ పార్టీ ప్రజల్లో నమ్మకం కోల్పోవడం అలాగే ఆ పార్టీలో అంతర్గత కలహాలు పెరిగి అనిశ్చితి నెలకొనడంతో సరైన నాయకత్వం లేకపోవడం వల్ల నాయకులకు కార్యకర్తలకు రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడం వల్ల దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ రోజురోజుకూ బలపడుతుండడం.... కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల హృదయాలను గెలుచుకోవడం అలాగే జరుగుతున్న ప్రతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతుండడం చూసి పార్టీకి ఆకర్షితులై భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల కోసం అహర్నిశలు పని చేస్తున్నారని ప్రజా సంక్షేమం కోసమే పని చేస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజల కోసం మరిన్ని అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని..... ఇప్పటికే దేశంలోనే తెలంగాణ రాష్ట్రం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు పరచడంలో మొదటి స్థానంలో ఉందని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ, నాగిరెడ్డి, దండుగల యాదగిరి, షేరీ సతీష్ రెడ్డి, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, రమేష్,రాజేందర్ ,అస్లాం, అశోక్ ,మల్లికార్జున, శ్రీరాములు,లక్ష్మయ్య, మేకల రమేష్ ,కుక్కల రమేష్, పుష్ప రెడ్డి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పొంగులేటి హామీ హర్షం ప్రకటించిన లింగాల రవికుమార్



ఖమ్మం, అక్షర గళం:– ఖమ్మం జిల్లా వెలుగుమట్ల సమీపంలో భూధాన్ బోర్డు భూముల్లో నిరాశ్రయులైన అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించడం పట్ల బిఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షులు దళిత బహుజన సామాజిక ఉద్యమ నేత లింగాల రవికుమార్ హర్షం ప్రకటించారు. మంత్రి పొంగులేటి పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని, మంత్రి ఆధ్వర్యంలో గ్రామీణ పట్టణ ప్రాంతాలలో నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నారని లింగాల రవికుమార్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం భూదాన్ బోర్డు భూములలో దళారుల చేతిలో మోసపోయి ఆర్థికంగా నష్టపోయిన బాధితులకు పోలీస్ అధికారుల సహకారంతో డబ్బులు ఇప్పించేందుకు కృషి చేయాలని రవికుమార్ విజ్ఞప్తి చేశారు పునరావాస కేంద్రాలలో ఇబ్బంది పడుతున్న భూధాన్ బాధితులకు అత్యంత వేగవంతంగా ఇండ్ల స్థలాలు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వానికి సంబంధిత అధికారులకు లింగాల రవికుమార్ విజ్ఞప్తి చేశారు.



# ప్రజాసేవతోనే సమాజంలో గుర్తింపు

**ఆమనగల్లు, మార్చి 01 (అక్షరగళం):** ప్రజాసేవతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ప్రజా గాయకుడు, సామాజిక కార్యకర్త రెంజర్ల రాజేష్ అన్నారు. ఇటీవలే ఆమనగల్లు మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన ఏనుమల్ల రమేష్ ను ఆదివారం ఆయన నివాసంలో కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ.. పేదలకు అండగా ఉండి నిత్యం ప్రజల్లోనే ఉండాలన్నారు. 8వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేయాలన్నారు. ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఆయన వెంట గోరటి రమేష్, సింగల్ విండో డైరెక్టర్ జంగమ్మ తదితరులు ఉన్నారు.



# అమరుల త్యాగాల ఫలితమే వర్గీకరణ

**ఆమనగల్లు, మార్చి 01 (అక్షర గళం):** మాదిగ అమర వీరుల త్యాగ ఫలితంగానే ఎస్సీ వర్గీకరణను సాధించుకున్నామని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కావలి శ్రీశైలం అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు మండల అధ్యక్షుడు శ్రీశైలం అధ్వర్యంలో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక, సమానత్వపు పోరులో మాదిగల అస్థిత్వం, ఆత్మగౌరవం కోసం అసువులు బాసిన మాదిగ అమరుల త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు వస్పుల సాయిలు, మల్లెపోగు మల్లేష్, పులికంటి మైసయ్య, మండల అధికార ప్రతినిధి శ్రీశైలం మాదిగ, మంద రాకేష్ మాదిగ, ఉపాధ్యక్షుడు వస్పుల శ్రీరాములు మాదిగ, సోషల్ మీడియా కన్వీనర్ జంతుక విజయ్ కుమార్ మాదిగ, వస్పుల లక్ష్మణ్, శాంసన్, జంతుక శ్రీశైలం, చెక్క రమేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# మాదిగ అమరవీరులకు ఘన నివాళులు

**వెల్దండ మార్చి 01(అక్షరగళం) :** వెల్దండ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు సందర్భంగా వెల్దండ మండల గ్రామ కమిటీ అధ్యక్షులు కొప్పు గెల్వాయ్య మాట్లాడుతూ మాదిగ అమరవీరులు ప్రాణత్యాగం వృధా కాలేదని అన్నారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరుల ఆశయ సాధనలో 30 ఏళ్ల సుదీర్ఘ అలుపెరగని పోరాటం వల్ల పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధించి పెట్టడం జరిగిందన్నారు. ప్రజా సమస్యలు ఎలాంటి ఉన్న ముందుండే పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అడుగుజాడల్లో నడుస్తామని అన్నారు. వెంకటయ్య ఈదులపల్లి లక్ష్మణ్ ప్రకాష్ అశోక్ పెద్దయ్య జాషువ ఈదులపల్లి శ్రీనివాసులు పకాడి మహేష్ తదితరులు పాల్గొన్నారు



# ఆదర్శ బాలికల వసతిగృహం ఆకస్మిక తనిఖీ చేసిన సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్

**వెల్దండ మార్చి 01 (అక్షరగళం) :** వెల్దండ మండల కేంద్రంలోని మోడల్ బాలికల వసతి గృహాన్ని సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్లోని ఆహారాన్ని పరిశీలించి అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థులకు మిస్ చార్జీలు పెంచి, సన్న బియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నారని తెలిపారు. పరీక్షలో వందశాతం ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ నెంబర్ సభ్యులు ముదిగొండ రమేష్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# చల్లని పొదరిల్లు





మధ్యలో ఓ నాలుగు రోజులు వానలు దంచికొట్టాయి. వాతావరణం కొంత చల్లగా అనిపించింది. మళ్లీ ఎండలు ముదురుతున్నాయి. వేసవి తీవ్రత తెలిసివస్తున్నది. బయట వాతావరణం ఎలా ఉన్నా.. ఇంటికొచ్చాక అయినా చల్లగా అనిపించకపోతే.. నరకమే. చల్లదనం అనేది కొంతవరకు మనసుకు సంబంధించిన వ్యవహారం కూడా. ఎరుపు, నీలం, గోధుమ.. తదితర ముదురు వన్నెలు మనమనసును బెదరగొడతాయి. గోడలకు లేత వర్ణాలనే ఎంచుకోవాలి. ఆ చల్లని రంగుల మధ్య సముద్రతీరంలో ఉన్న అనుభూతి పొందుతాం. మినీ ఫౌంటెన్‌ను గది అలంకరణలో భాగం చేసుకోండి. ఆ జల్లుల చల్లదనాన్ని ఆస్వాదిస్తూ కాసేపు ఎండవేడిని మరిచిపోండి. కొన్ని అత్తర్లు చల్లని అనుభూతిని ఇస్తాయి. ఇంకొన్ని ఘాటైన వాసనలతో ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఉదాహరణకు పెప్పర్‌మింట్ ఆయిల్‌కు చల్లదనపు గుబాళింపులు పంచే గుణం ఉంది. సాధ్యమైనంత వరకు కాటన్, లినెన్ వస్త్రాలనే ధరించాలి. వాటికి శ్వాసించే గుణం ఉంటుంది. కాబట్టే, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి చేయవు. కర్టెన్లు, బెడ్‌షీట్స్, దుప్పట్లు.. దేనికైనా జై కాటన్ అనాల్సిందే. సింథటిక్ మెటీరియల్ వాతావరణంలో వేడిని సృష్టిస్తుంది. మన ఇంట్లో ఎయిర్ కండిషనర్ ఏ వైపున పెట్టామన్నదీ ముఖ్యమే. ఏసీని పడమర, ఉత్తర భాగాల్లో బిగించాలి. అప్పుడే గాలి సమంగా విస్తరిస్తుంది. గృహాలంకరణలో మొక్కలను కూడా భాగం చేయండి. తూర్పు, ఉత్తరం, ఈశాన్యం.. కుండీలు ఉంచేందుకు అనువైన ప్రదేశాలు.



# ఎల్లో కలర్ వాటర్ మిలన్!

కరీంనగర్, ఏప్రిల్ 17 : కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పలువురు రైతులు అరుదైన ఎల్లో వాటర్ మిలన్ పండిస్తున్నారు. కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన మంద రాధ, తిరుపతి రైతు దంపతులు కొన్నేండ్లుగా సాగు చేస్తున్నారు. ఈ సారి కూడా నాలుగు ఎకరాల్లో పంట వేయగా ఎకరాకు సుమారు 15 టన్నుల దిగుబడి వస్తున్నట్టు రైతు మంద రాధ తెలిపారు. కిలోకు రూ. 20 చొప్పున రిలయన్స్, ప్యూర్ నేచర్, మోర్ వంటి కార్పొరేట్ షాపింగ్ మాల్స్ నిర్వాహకులు కొనుగోలు చేసుకుంటున్నారు. పైన పసుపు రంగులో కనిపించే ఈ కాయ లోపల ఎరుపు రంగులో ఉంటుంది. చూడగానే తినాలనిపించేలా, చాలా రుచిగా కూడా ఉంటుంది. జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం పెంబట్లకు చెందిన బండారి వెంకటేశ్ కూడా ఈ రకం వాటర్ మిలన్ పండించారు. కిలో రూ.40 చొప్పున జగిత్యాలలో విక్రయిస్తున్నారు.

# ఫ్రిజ్‌లో పెట్టి తినొచ్చా?

**ఫ్రిజ్‌లో పెట్టిన ఆహారం ఎంత వరకూ మంచిది. చల్లదనం వల్ల ఆహార పదార్థాల జీవితకాలం పెరుగుతుంది అంటారు కదా! కూర, పప్పులాంటివి కూడా ఫ్రిజ్‌లో పెట్టుకుని మరుసటి రోజు తినొచ్చా?**

ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల ఆహార పదార్థాల జీవితకాలం పెరుగుతుందన్నమాట నిజమే. అయితే రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేసేందుకు, వాటిని తీసి మళ్లీ తినేందుకు కొన్ని ప్రత్యేక పద్ధతులు ఉన్నాయి. ముఖ్యంగా, ఫ్రిజ్‌లో పెట్టిన ఏ పదార్థాన్ని అయినా బయటికి తీశాక.. గది ఉష్ణోగ్రతకు వచ్చేదాకా ఉంచి.. ఆ తర్వాతే వినియోగించాలి. దీన్ని ఇంగ్లిష్‌లో 'తావింగ్' అంటాం. పప్పు, కూరల్లాంటి వండిన పదార్థాలను నిల్వ చేయాలి అనుకుంటే.. వండిన రెండు గంటల్లోపే ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. అలా అయితేనే దాదాపు 48 గంటల వరకూ పాడవకుండా ఉంటాయి. రెండు గంటల తర్వాత నుంచీ వండిన పదార్థాల్లో బ్యాక్టీరియా పెరుగుదల మొదలవుతుంది. అదే వండని మాంసాన్ని నిలువ చేయాలంటే మాత్రం డీప్‌ఫ్రిజ్ ఉపయోగించాలి. అందులో ఉంచి ఫ్రీజర్ ఆన్ చేస్తే మాంసం రెండు రోజుల దాకా నిలువ ఉంటుంది. పండ్లూ, కూరగాయల్లాంటివి వారం నుంచి పది రోజుల దాకా పాడవకుండా ఉంటాయి. ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (ఎఫ్‌డీఏ) ప్రకారం ఉడికించిన ఏ పదార్థాన్ని అయినా.. ఎలాంటి వాతావరణంలో నిల్వ చేసినా.. గరిష్ఠంగా వారం రోజుల వరకు మాత్రమే తినాలి. అలాగే స్ట్రాబెర్రీలు, ములక్కాడలాంటి వాటిని గడ్డ కట్టించి మూడు, నాలుగు నెలలకుపైగా నిలువ ఉంచుతారు. అయితే అప్పటికప్పుడు తినే ఆహార పదార్థాలతో పోలిస్తే రోజుల తరబడి నిల్వ ఉంచిన వాటిలోని పోషక విలువలు సన్నగిల్లుతాయి. ఆస్తమా, సైనసైటిస్, శ్వాస సంబంధ సమస్యలు ఉన్నవారు మాత్రం ఆరోగ్య కారణాల రీత్యా నిలువ ఆహారానికి దూరంగా ఉండాలి. తాజా పదార్థాలను మాత్రమే తినడం మంచిది.



# విహారయాత్రలకు వెళ్లేప్పుడు ఎలాంటి ఆహారం తినాలి..

%మనం ఆహారాన్ని ఎంచుకునేప్పుడు సీజనల్..లోకల్.. ఈ రెండిటికీ ప్రాధాన్యమివ్వాలి. ఏ ఆహారమైనా స్థానిక వాతావరణానికి సరిపడేలా ఉంటుంది. అలాగే అక్కడి పండ్లూ, కూరల్లోని పోషకాలు కూడా ఆ ప్రాంతపు అవసరాలకు తగ్గట్టుగా లభిస్తాయి. కాబట్టి ఇతర రాష్ట్రాలు, దేశం.. ఎక్కడికి వెళ్లినా ఆ సీజన్‌లో, ఆ ప్రాంతంలో దొరికే వాటికే ప్రాధాన్యమివ్వండి. అయితే, ఆహారం ఏదైనా డీప్‌ఫ్రైలకు దూరంగా ఉండటం మంచిది. వేసవిలో ఈ జాగ్రత్త మరీ ముఖ్యం. అప్పుడే అరుగుదల సులభంగా ఉంటుంది. అయితే, ఇప్పటిదాకా ఎప్పుడూ తినని కొత్త ఆహారాన్ని రుచి చూడాలనుకున్నప్పుడు.. అది కూడా ముఖ్యంగా మాంసా హారమైతే, తప్పకుండా మధ్యాహ్న భోజనంతోనే ముగించేయండి. పొరపాటున ఇబ్బంది పెట్టినా రాత్రికల్లా సర్దుకుంటుంది. డాక్టర్‌ను కలవాల్సి వచ్చినా పగటిపూట కాబట్టి సులభమే. సాయంత్రం భోజనంలో తప్పకుండా పెరుగన్నం లేదా మజ్జిగ ఉండేలా చూసుకోండి. జీర్ణాశయ సమస్యల్ని ఇది సరిచేస్తుంది. రాత్రిపూట మితంగా తింటేనే మేలు. వేసవి కనుక ఎప్పటికప్పుడు నీళ్లు తాగుతూ ఉండండి. బాటిల్ నీళ్లకే మొగ్గు చూపండి. బ్రేక్‌ఫాస్ట్‌లో బాయిల్డ్ ఎగ్, మధ్యమధ్యలో కాలక్షేపానికి బాదం, వాల్‌నట్ లాంటివి తీసుకుంటే ఉత్సాహంగా ఉంటుంది. బాగా తిరగగలం. అప్పుడప్పుడూ గింజలు తినడం వల్ల చాలాసేపు ఆకలి వేయదు. దీంతో అడ్డమైందీ తినేసే ప్రమాదం ఉండదు. శుభకార్యాలకు వెళ్లినప్పుడు భోజనానికి ముందు సలాడ్ తీసుకుంటే సరి. సగం కడుపు నిండిపోతుంది. దీనివల్ల మిగతా రుచులు మరీ ఎక్కువ తినలేం. న ం ర క్షి త వై న మంచినీళ్లూ ముఖ్యమే.



# రోగాల షేక్


ఎర్రటి ఎండలో కాస్తంత దూరం నడవగానే చెమటలు కారిపోతాయి. తీవ్రంగా అలసిపోతాం. దాహమేస్తుంది. ఆ సమయంలో నోరూరించే మిల్క్‌షేక్ కనిపిస్తే? మరో ఆలోచన లేకుండా లాగించేస్తాం. కమ్మకమ్మని.. చిక్కచిక్కని.. మిల్క్‌షేక్‌ను ఏ సీజన్‌లో అయినా కాదనలేం. బాదం, బనానా, మ్యాంగో, స్ట్రాబెర్రీ.. ఇలా రకరకాల షేక్స్ మార్కెట్లో దొరుకుతున్నాయి. నోటికి కాస్త రుచిగా అనిపించినా, వీటివల్ల ఆరోగ్యానికి చేటే అని హెచ్చరిస్తున్నారు నిపుణులు. వీటి కంటే పండ్లరసాలే మేలని సూచిస్తున్నారు.చాలామంది మిల్క్‌షేక్ అనగానే స్వచ్ఛమైన పాలు, పండ్లతో చేస్తారనుకుంటారు. నిజానికి అవేవీ అసలు పండ్లు కాదు. రుచి కోసం రసాయన ఫ్లేవర్స్ కలుపుతారంతే. నిజమైన పాలు, పండ్లు వాడినా కూడా.. ఈ కాంబినేషన్ సరికాదని చెబుతున్నది ఆయుర్వేదం. దీనివల్ల ఎన్నో జీర్ణ సంబంధ రుగ్మతలకు అవకాశం ఇచ్చినట్టే. గ్యాస్ట్రిక్ సమస్య, వికారం, ఎసిడిటీ, ఛాతీలో మంటతోపాటు పేగు సంబంధ వ్యాధులకు మిల్క్ షేక్స్ కారణం అవుతున్నాయట. అందులోనూ బనానా మిల్క్ షేక్స్ సైనస్ గ్రంథులపై ప్రభావం చూపుతాయట. మ్యాంగో మిల్క్‌షేక్ పేగు సమస్యలకు కారణం అవుతుందట. తయారీ సమయంలో కల్తీ నీళ్లు వాడినట్టయితే.. మరిన్ని రోగాలను పుచ్చుకున్నట్టే. కాబట్టి, జాగ్రత్త!



# పండంటి గోళ్లు



గోళ్లరంగు నెయిల్ ఆర్ట్‌గా మారి చాలా కాలమైంది. ఎప్పటికప్పుడు సరికొత్త డిజైన్లతో పరిగెత్తే ఫ్యాషన్‌కి పిల్లకాలువలా తయారైంది. ఇప్పుడు చెర్రీపండ్ల అందాన్నీ సంతరించుకుని సరికొత్తగా ముస్తాబవుతున్నది. ఇన్‌స్టాగ్రామ్ సహా చాలా సోషల్ మీడియా మాధ్యమాల్లో బ్యూటీ ఇన్‌ఫ్లుయెన్సర్లంతా 'చెర్రీ నెయిల్స్'కే ఓటేస్తున్నారు. ఆకుపచ్చ ఆకులు, తొడిమెలతో ఎర్రటి చెర్రీ పండ్లు గోళ్ల మీద మెరుస్తు న్నాయి. మావీ పండంటి గోళ్లే అనిపించుకోవాలంటే ఈ ట్రెండ్ ఫాలో కావాల్సిందే!



# స్థిరాస్తి రంగంలో విదేశీ పెట్టుబడుల వెల్లువ..



**ఈ క్యూ1లో 813 మిలియన్ డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్స్**

**ఇందులో 43 శాతం వాటా ఫారినర్స్‌దే..**

**నివాస, వాణిజ్య విభాగంలోనే అధిక పెట్టుబడులు**

ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొంటే.. మన దేశం మాత్రం వేగవంతమైన ఆర్థిక అభివృద్ధి సాధిస్తోంది. దేశీయ స్థిరాస్తి రంగంలో విదేశీ పెట్టుబడులు గణనీయంగా పెరుగుతున్నాయి. దేశాభివృద్ధిపై దేశీయ పెట్టుబడిదారులకు విశ్వాసం ఉన్నప్పటికీ.. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో విదేశీ పెట్టుబడిదారుల భాగస్వామ్యం పెరిగింది. దేశంలో బలమైన ఆర్థిక వృద్ధి, వేగవంతమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రోత్సాహకర ప్రభుత్వ విధానాలు, సులభతర పెట్టుబడి విధానం వంటి రకరకాల కారణాలతో విదేశీ పెట్టుబడిదారుల వాటా గతేడాది తొలి త్రైమాసికం(క్యూ1)లో 2 శాతం నుంచి ఈ ఏడాది క్యూ1 నాటికి ఏకంగా 43 శాతానికి పెరిగిందని వెస్టియన్ నివేదిక వెల్లడించింది

**విదేశీ పెట్టుబడుల వెల్లువ..**

దేశంలోకి 2024 క్యూ1లో 552.1 మిలియన్ డాలర్ల సంస్థాగత పెట్టుబడులు వచ్చాయి. ఇందులో విదేశీ పెట్టుబడులు కేవలం 4 శాతమే. అంటే 11 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. అదే 2025 క్యూ1 నాటికి మొత్తం 813.3 మిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగా.. ఇందులో విదేశీ పెట్టుబడుల వాటా ఏకంగా 43 శాతం. 346.9 మిలియన్ డాలర్ల ఫారిన్ ఇన్వెస్ట్‌మెంట్స్ వచ్చాయి.

**నివాసంలోకే అత్యధికం..**

నివాస విభాగంలో పెట్టుబడులకే విదేశీయులు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. గృహ రంగంలోకి 506 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. మొత్తం ఇన్వెస్ట్‌మెంట్స్‌లో రెసిడెన్షియల్ సెక్టార్ వాటా 62 శాతం. గతేడాది క్యూ1తో పోలిస్తే ఇది 41 శాతం అధికం. విలువల పరంగా చూస్తే.. పెట్టుబడులు వార్షికంగా 125 శాతం వృద్ధి నమోదు చేశాయి. ఆ తర్వాత వాణిజ్య విభాగంలోకి 307.2 మిలియన్ డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్స్ వచ్చాయి.ఈ త్రైమాసికంలో వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో ఈ విభాగం వాటా 38 శాతం. అయితే ఈ క్యూ1లో పారిశ్రామిక, గిడ్డంగుల విభాగంలోకి ఎలాంటి పెట్టుబడులు రాలేదు. అయితే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ%-%కామర్స్ రంగం, లాజిస్టిక్ ఖర్చుల తగ్గింపు నేపథ్యంలో భవిష్యత్తులో ఈ విభాగంలోకి పెట్టుబడులు వచ్చే అవకాశాలు అపారంగా ఉన్నాయి.



## వేర్‌హౌస్ లావాదేవీల్లో.. అప్ అండ్ డౌన్

**గిడ్డంగుల లావాదేవీల్లో వృద్ధి.. సరఫరాలో క్షీణత**

**2025 క్యూ1లో 3 లక్షల చ.అ. స్థలం లీజుకు**

**ఇదే కాలంలో సరఫరా 2 లక్షల చ.అ.లే**

**50 శాతం పెరిగిన లీజులు, 67 శాతం తగ్గిన సప్లయి**

హైదరాబాద్ పారిశ్రామిక గిడ్డంగుల(వేర్‌హౌస్) విపణిలో భిన్న వాతావరణం ఏర్పడింది. ఈ ఏడాది తొలి త్రైమాసికం(క్యూ1)లో నగరంలో 3 లక్షలు చ.అ. లావాదేవీలు జరిగాయి. గతేడాది ఇదే కాలంలో జరిగిన 2 లక్షల లావాదేవీలతో పోలిస్తే ఇది 50 శాతం అధికం. ఇక, 2025 క్యూ1లో నగరంలో కొత్తగా 2 లక్షల చ.అ. గిడ్డంగుల స్థలం సరఫరా అయ్యింది. గతేడాది ఇదే కాలంలో సరఫరా అయిన 6 లక్షల చ.అ.లతో పోలిస్తే ఇది 67 శాతం తక్కువ.ఈ ఏడాది క్యూ1లో దేశంలోని 8 ప్రధాన నగరాల్లో 90 లక్షల చ.అ. పారిశ్రామిక గిడ్డంగుల స్థల లావాదేవీలు జరిగాయి. గతేడాది ఇదే కాలంలో జరిగిన 78 లక్షల చ.అ. లావాదేవీలతో పోలిస్తే ఇది 15 శాతం అధికం. ఎక్కువగా ఇంజినీరింగ్ కంపెనీలు 25 శాతం, ఈ%-%కామర్స్ సంస్థలు 21 శాతం స్పేస్‌ను లీజుకు తీసుకున్నాయని కొలియర్స్ ఇండియా నివేదిక వెల్లడించింది. అలాగే ఈ క్యూ1లో కొత్తగా 94 లక్షల చ.అ. స్పేస్ సరఫరా అయింది. గతేడాది క్యూ1తో పోలిస్తే ఇది 16 శాతం ఎక్కువ.

## పెరిగిన అద్దెలు.. హైదరాబాద్‌లో అక్కడే ఫుల్ డిమాండ్!

**ప్రధాన నగరాల్లో పెరుగుతున్న అద్దె గృహాల విపణి**

**పశ్చిమ హైదరాబాద్‌లో అద్దె గృహాలకు డిమాండ్**



కొనేటప్పుడు తక్కువ ధరకు కావాలి.. అమ్మేటప్పుడు ఎక్కువ ధర రావాలని కోరుకునేది స్థిరాస్తి రంగంలోనే.. ఇది అద్దె విభాగానికీ వర్తిస్తుంది. గత కొన్నేళ్లుగా దేశంలోని ప్రధాన నగరాలలో అద్దె గృహాల మార్కెట్ క్రమంగా పెరుగుతోంది. ప్రధానంగా మెరుగైన ప్రయాణ సాధనాలు, పని కేంద్రాలకు చేరువలో ఉన్న అద్దె ఇళ్లకు డిమాండ్ ఉంది.ప్రాపర్టీల విలువ పెరగడంతో గృహ యజమానులు అద్దెల కంటే లాభదాయకమైన ఆస్తుల విక్రయాల కోసం అన్వేషిస్తుండంతో సప్లయ్ తగ్గింది. దీంతో అద్దె గృహాలకు డిమాండ్‌తో పాటు రెంట్లు కూడా పెరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది తొలి త్రైమాసికంలో హైదరాబాద్‌లో అద్దె గృహాలకు డిమాండ్ 22 శాతం మేర పెరిగింది. సరఫరా 2.1 శాతం క్షీణించగా.. సగటు రెంట్లు 4.5 శాతం మేర పెరిగాయి. అద్దెల మార్కెట్‌లో డిమాండ్ 50, సప్లయి వాటా 39 శాతంగా ఉన్నాయి.గచ్చిబౌలి, మాదాపూర్ వంటి పశ్చిమ హైదరాబాద్ ప్రాంతాల్లోని అద్దె గృహాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. కార్యాలయాలు, ఉపాధి కేంద్రాలకు సమీపంలో ఉండటం, ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)తో మెరుగైన కనెక్టివిటీనే ప్రధాన కారణం. రూ.25 వేలు నుంచి రూ.35 వేలు నెలవారీ అద్దెలకు కోసం ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. 1,000 చ.అ. నుంచి 1,500 చ.అ. విస్తీర్ణంలో ఉన్న గృహాలకు డిమాండ్ అధికంగా ఉంది.




## అపోలో ఫార్మసీ 1,000వ స్టోర్

హైదరాబాద్ : అపోలో హాస్పిటల్స్‌కు చెందిన అపోలో ఫార్మసీ మరో మైలురాయికి చేరుకున్నది. హైదరాబాద్‌లో కంపెనీ ఏర్పాటు చేసిన 1,000వ స్టోర్‌ను కంపెనీ వైస్ చైర్‌పర్సన్ ఉపాసన కామినేని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..వచ్చే మూడేండ్లకాలంలో మరో 200కి పైగా స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం సంస్థ తెలంగాణలోని 33 జిల్లాలో వెయ్యి స్టోర్లను నిర్వహిస్తున్నదని, తద్వారా పదివేల మందికి పైగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. రిటైల్‌తోపాటు ఆన్‌లైన్‌లో కూడా ఔషధాలను డెలివరీ చేస్తున్నది. ప్రతిరోజూ 1.65 లక్షల మెడిసిన్ ఆర్డర్లు వస్తున్నాయన్నారు.

## ఆటో విడిభాగాలకు టారిఫ్‌ల సెగ

**రూ. 4.5 వేల కోట్ల ఆదాయానికి గండి**



న్యూఢిల్లీ: టారిఫ్‌ల వల్ల ఎగుమతులు మందగించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరం ఆటో విడిభాగాల తయారీ సంస్థల ఆదాయాలు సుమారు రూ. 4,500 కోట్ల మేర క్షీణించవచ్చని రేటింగ్స్ ఏజెన్సీ ఇక్రా వెల్లడించింది. 2024 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 3 లక్షల కోట్లుగా పరిశ్రమ ఆదాయం నమోదైందని, ఒకవేళ టారిఫ్‌ల వివాదం వల్ల అమెరికాకు ఎగుమతులు మధ్యస్త%-%గరిష్ట సింగిల్ డిజిట్ స్థాయిలో క్షీణించిన పక్షంలో 2025%-%26లో ఆదాయ వృద్ధి 6%-%8 శాతానికి పరిమితం కావచ్చని పేర్కొంది. గతంలో ఇది 8%-%10 శాతంగా ఉండొచ్చని ఇక్రా అంచనా వేసింది. భారీ టారిఫ్‌ల వల్ల సరఫరా వ్యవస్థపై అదనంగా రూ. 9,000 కోట్ల భారం పడుతుందని, దీన్ని అమెరికా వినియోగదారులు, అక్కడి దిగుమతిదారులు, భారతీయ ఎగుమతిదారులు భరించాల్సి వస్తుందని వివరించింది. సరఫరాదారు ప్రాధాన్యత, పోటీ, సాంకేతిక ప్రాధాన్యత అంశాలను బట్టి వారు ఎంత మేర భారాన్ని బదలాయించగలరనేది ఆధారపడి ఉంటుందని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ షంషేర్ దివాన్ తెలిపారు.

ఒకవేళ అదనపు టారిఫ్ వ్యయాల్లో 30%-%50 శాతాన్ని భారతీయ ఆటో విడిభాగాల ఎగుమతిదారులు భరించే పక్షంలో సుమారు రూ. 2,700%-%4,500 కోట్ల భారం మోయాల్సి వస్తుందని వివరించారు. ఇది పరిశ్రమ నిర్వహణ లాభాల్లో 3%-%6 శాతమని, ఆటో విడిభాగాల ఎగుమతిదార్ల నిర్వహణ లాభాల్లో 10%-%15 శాతం అని పేర్కొన్నారు. 2024 ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమ మొత్తం ఆదాయాల్లో అమెరికా వాటా సుమారు 8 శాతంగా నమోదైంది. 2020%-%24 మధ్య కాలంలో అమెరికాకు ఆటో విడిభాగాల ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 15 శాతం స్థాయిలో పెరిగాయి. ఇంజిన్లు, ఎలక్ట్రికల్ కాంపొనెంట్లులాంటి కీలకమైన ఆటోమొబైల్ విడిభాగాలపై మే 3 నుంచి అమల్లోకి వచ్చేలా అమెరికా 25 శాతం టారిఫ్‌లు ప్రకటించిన సంగతి తెలిసిందే. భారత్ ఎగుమతి చేసే విడిభాగాల్లో దాదాపు 65 శాతం కాంపొనెంట్లు 25 శాతం టారిఫ్‌ల కేటగిరీలోకి వస్తాయి.



## ఇళ్ల కొనుగోలు నిర్ణయం.. యువతే కీలకం

కరోనాతో స్థిరాస్తి రంగానికి జరిగిన ప్రధాన మేలు.. సొంతింటి అవసరం తెలిసిరావటమే. మరీ ముఖ్యంగా గృహ విభాగంలో యువతరం భాగస్వామ్యం పెరగడం. ఇళ్ల కొనుగోలు నిర్ణయంలో వీరు కీలకంగా మారారు. 74 శాతం సంపన్న కొనుగోలుదారులు ద్రవ్యోల్బణాన్ని నిరోధించేందుకు రియల్ ఎస్టేట్ ఒక ప్రధాన ఆస్తిగా పరిగణిస్తారు. విశాలవంతమైన గృహాలు, గ్రీనరీ ఎక్కువగా ఉండే ప్రాపర్టీలకే లగ్జరీ కొనుగోలుదారులు మొగ్గు చూపిస్తున్నారు. సంపన్న భారతీయుల ప్రాపర్టీ ఎంపికలో తొలి ప్రాధాన్యం మెరుగైన ఫిజికల్, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సదుపాయాలకే. సంపన్న కొనుగోలుదారులు ప్రాపర్టీ కొనుగోళ్లకు ప్రధాన కారణం మెరుగైన జీవన శైలి. మూలధన వృద్ధి, భవిష్యత్తు తరాలకు ఆస్తి వంటివి ఆ తర్వాతి అంశాలు. ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, గోవా, బెంగళూరు నగరాలలో గృహాల కొనుగోళ్లకు హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్(హెచ్‌ఎన్‌ఐ), అల్ట్రా హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్(యూహెచ్‌ఎన్‌ఐ)లు ఆసక్తిగా ఉన్నారు. 11 శాతం మంది సంపన్నులు విదేశాలలో ప్రాపర్టీలకు మొగ్గు చూపుతున్నారు.

## కొత్త ఏఐ ఆధారిత ల్యాప్‌టాప్‌లు.. ఫీచర్లు..

హెచ్‌పీ తన తదుపరి తరం ఏఐ ఆధారిత ల్యాప్‌టాప్‌లను మార్కెట్‌లో విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. కొత్తగా ప్రవేశపెట్టిన హెచ్‌పీ ఎలైట్ బుక్, ప్రోబుక్, ఓమ్నీబుక్‌లను విభిన్న వ్యాపారాలు, వినియోగదారుల అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడానికి రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. వీటిలో సెకనుకు 40 నుంచి 55 ట్రిలియన్ కార్యకలాపాలను అందించగల డెడికేటెడ్ న్యూరల్ ప్రాసెసింగ్ యూనిట్లు (ఎన్‌పీయూ) ఉన్నాయని పేర్కొంది. ఏఐ కంప్యూటింగ్‌లో ఈ డివైజ్‌లు ముందంజలో ఉన్నాయని తెలిపింది.ఇంటెల్ కోర్ అల్ట్రా 200 వి సిరీస్, ఏఎండీ రైజెన్ ఏఐ 300 సిరీస్, క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ ఎక్స్ సిరీస్ చిప్‌లతో ఈ ల్యాప్‌టాప్‌లను తయారు చేసినట్లు సంస్థ చెప్పింది. తాజా ప్రాసెసర్లతో నడిచే ఈ ల్యాప్‌టాప్‌లు అడాప్టివ్ వర్క్‌లోడ్‌ను సర్దుబాటు చేసుకుంటూ రియల్ టైమ్ నాయిస్ క్యాన్సిలేషన్, వీడియో కాల్స్ సమయంలో ఆటో ఫ్రేమింగ్ వంటి ఆప్టిమైజేషన్లను అందిస్తాయని తెలిపింది. హెచ్‌పీ ఏఐ కంపానియన్: ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండా వినియోగదారుల ప్రశ్నలకు తక్షణ సమాధానాలు, సురక్షితమైన ఫైల్ విశ్లేషణను అందించే రీసెర్చ్ అసిస్టెంట్.పాలీ కెమెరా ప్రో: ఆటో ఫ్రేమింగ్, మల్టీ కెమెరా సపోర్ట్, స్ట్రీమింగ్ ఇంటిగ్రేషన్‌తో వర్చువల్ సమావేశాలను మెరుగుపరచడం. మైహెచ్‌పీ ప్లాట్ ఫామ్: వినియోగదారు భద్రతను ప్రోత్సహిస్తూ డివైజ్ పనితీరు, బ్యాటరీ ఆప్టిమైజేషన్‌ను మెరుగుపరుచడం. డివైజ్ తయారీలో రీసైకిల్ చేసిన ప్లాస్టిక్, లోహాన్ని ఉపయోగించారు. ఇది పర్యావరణ సుస్థిరత పట్ల కంపనీ నిబద్ధతను స్పష్టం చేస్తుంది. ఎనర్జీ స్టార్ సర్టిఫికేషన్, ఈపీఈఏటీ గోల్డ్ రిజిస్ట్రేషన్‌ను సొంతం చేసుకుంది. ఇది గ్రీన్ టెక్నాలజీ పట్ల కంపెనీ అంకితభావాన్ని మరింత బలోపేతం చేస్తుంది. హెచ్‌పీ వోల్ఫ్ ప్రో సెక్యూరిటీ వంటి భద్రతా ఫీచర్లు పెరుగుతున్న ఆన్‌లైన్ బెదిరింపుల నుంచి రక్షణ ఇస్తాయని సంస్థ పేర్కొంది. హెచ్‌పీ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ ఇప్సితా దాస్ గుప్తా మాట్లాడుతూ..'భారతదేశం అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధ పర్యావరణ వ్యవస్థ ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని వీటిని రూపొందించాం. హెచ్‌పీ డివైజ్‌ల్లో పరిశ్రమలు, స్టార్టప్‌లు, వ్యక్తుల సాధికారతలో అర్థవంతమైన ఆవిష్కరణలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నాం' అన్నారు.



## 18 ఏళ్లలో 33 లక్షల మంది కొన్న కారు: దీని గురించి తెలుసా?

2007లో ఇండియన్ మార్కెట్లో అరంగేట్రం చేసినప్పటి నుంచి 'హ్యుందాయ్ ఐ10' ఏకంగా 33 లక్షల యూనిట్ల అమ్మకాలను అధిగమించింది. ఒక్క భారతదేశంలోనే ఈ కారును 20 లక్షల కంటే ఎక్కువ మంది కొనుగోలు చేశారు. కాగా కంపెనీ 140 కంటే ఎక్కువ దేశాలలో మరో 13 లక్షల యూనిట్లను ఎగుమతి చేసినట్లు తెలుస్తోంది.హ్యుందాయ్ కంపెనీకి చెందిన ఐ10ను ఎక్కువగా దక్షిణాఫ్రికా, మెక్సికో, చిలీ, పెరూ దేశాలకు ఎగుమతి చేశారు. 2007లో మొదటి సారి ఇండియన్ మార్కెట్లో అడుగుపెట్టిన ఈ కారు.. ఆ తరువాత అనేక అప్డేట్స్ పొందుతూ.. ఐ10, గ్రాండ్ ఐ10, గ్రాండ్ ఐ10 నియోస్ అనే మూడు వేరియంట్లలో.. 1.2 లీటర్ పెట్రోల్ మాన్యువల్, 1.2 లీటర్ పెట్రోల్ ఆటోమాటిక్, %జచీ+%తో 1.2 లీటర్ పెట్రోల్ అనే మూడు ఇంజిన్ ఆప్షన్లలో అందుబాటులోకి వచ్చింది. హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ ప్రతి ఏటా సగటున లక్ష యూనిట్ల కంటే ఎక్కువ ఐ10 కార్లను విక్రయించింది. ఇది మంచి డిజైన్, డ్యూయల్ ఎయిర్‌బ్యాగ్‌లు, ఏబీఎస్, కీలెస్ ఎంట్రీ వంటి అనేక కొత్త ఫీచర్స్ పొందింది. గ్రాండ్ %ఐ%10 నియోస్ ధర రూ. 5.92 లక్షల నుంచి రూ. 8.56 లక్షల (ఎక్స్-షోరూమ్) వరకు ఉంటుంది.



## యువత- మాదకద్రవ్యాల ముప్పు

తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, ఆధునికత వైపు వేగంగా అడుగులు వేస్తున్నప్పటికీ, అదే సమయంలో యువతను మెల్లగా కానీ ప్రమాదకరంగా కబళిస్తున్న ఒక సామాజిక సమస్య మన ముందుంది. అదే మాదకద్రవ్యాల బానిసత్వం. ఇది ఇప్పుడు కొద్దిమంది వరకు పరిమితమైన సమస్యగా కాకుండా, నగరాలు–గ్రామాలు అన్న తేడా లేకుండా విస్తరిస్తున్న సామాజిక సంక్షోభంగా మారింది. విద్యార్థులు, ఉద్యోగార్థులు, యువ ఉద్యోగులు కూడా ఈ మత్తు పదార్థాల బారిన పడుతున్న తీరు తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రారంభంలో సరదాగా, స్నేహితుల ఒత్తిడితో లేదా ఒత్తిడికి ఉపశమనంగా మొదలయ్యే మత్తు అలవాటు, క్రమంగా వ్యక్తి జీవితాన్నే కాదు, కుటుంబాన్నీ, సమాజాన్నీ నాశనం చేస్తోంది. గంజాయి వంటి పదార్థాలతో మొదలయ్యే ప్రయోగాలు, కాలక్రమంలో మరింత ప్రమాదకరమైన డ్రగ్స్ వైపు దారితీస్తున్నాయి. చిన్న వయసులోనే ఈ అలవాట్లు మొదలైతే, విద్య దెబ్బతింటుంది, భవిష్యత్తుపై ఆశలు మసకబారుతాయి. పాఠశాల స్థాయి విద్యార్థులు కూడా ఈ మత్తు సంస్కృతిలోకి జారుతున్నారన్న వార్తలు మన సమాజం ఎంత నిర్లక్ష్యంగా మారిందో తెలియజేస్తున్నాయి. యువత ఈ దారిలోకి వెళ్లడానికి అనేక కారణాలు ఉన్నాయి. తీవ్రమైన విద్యా పోటీ, ఉద్యోగ భద్రతపై భయం, కుటుంబ ఒత్తిళ్లు, భావోద్వేగ ఒంటరితనం యువతను మానసికంగా కుంగదీస్తున్నాయి. ఆ ఒత్తిడికి తాత్కాలిక ఉపశమనంగా మత్తు పదార్థాలను ఆశ్రయించడం ప్రమాదకరమైన మార్గమని తెలిసినా, సరైన మార్గదర్శకత్వం లేకపోవడంతో వారు ఈ బాటలో ముందుకు సాగుతున్నారు. మరోవైపు చట్టాలు ఉన్నప్పటికీ మాదకద్రవ్యాలు సులభంగా లభించడం, వాటి అక్రమ వ్యాపారం నిరంతరం కొనసాగడం పరిస్థితిని మరింత తీవ్రం చేస్తోంది. మాదకద్రవ్యాల బానిసత్వం వల్ల కలిగే నష్టం గణాంకాల్లో మాత్రమే కాదు, ప్రతి రోజూ కుటుంబాల్లో కనిపిస్తోంది. చదువులో వెనుకబడటం, ఉద్యోగాలు కోల్పోవడం, ఆరోగ్య సమస్యలు, మానసిక వ్యాధులు, నేర ప్రవ ృత్తి పెరగడం వంటి పరిణామాలు యువతను అంధకారంలోకి నెట్టేస్తున్నాయి. కొందరు యువకులు తమ అలవాట్ల కోసం నేరాలకు పాల్పడితే, మరికొందరు ప్రాణాలనే కోల్పోతున్నారు. ఈ పరిస్థితి సమాజం మొత్తం భవిష్యత్తును ప్రశ్నిస్తోంది. ప్రభుత్వం మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, కేవలం పోలీసు చర్యలతోనే ఈ సమస్యను నిర్మూలించడం సాధ్యం కాదు. చట్టపరమైన కఠినతతో పాటు సామాజిక చైతన్యం అవసరం. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనించాలి, వారితో స్నేహపూర్వకంగా మాట్లాడాలి. పాఠశాలలు, కళాశాలలు మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. యువతకు క్రీడలు, స ృజనాత్మక కార్యకలాపాలు, ఉపాధి అవకాశాలు పెంచడం ద్వారా వారికి సానుకూల మార్గాలు చూపాలి. తెలంగాణ యువతే రాష్ట్రానికి మూలధనం, బలమైన భవిష్యత్తు. ఆ యువత మత్తు పదార్థాల బానిసత్వంలో చిక్కుకుంటే, అది వ్యక్తిగత వైఫల్యం కాదు, సమాజంగా మనం చేసిన తప్పిదం. ఈ సమస్యను ఇప్పుడే గంభీరంగా ఎదుర్కొనకపోతే, రేపు దాని ప్రభావం మరింత భయంకరంగా ఉంటుంది. యువతను మత్తు సంస్క ృతి నుంచి దూరం పెట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించినప్పుడే, తెలంగాణకు ఆరోగ్యమైన భవిష్యత్తు సాధ్యం అవుతుంది.

# ట్రంప్ రాజకీయాలు భారత్ ఎదుర్కొన్న పాఠాలు

**డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న కాలంలోనే కాదు, ఆ తర్వాత కూడా ఆయన రాజకీయ ఆలోచనలు ప్రపంచ రాజకీయాలపై, ముఖ్యంగా భారతదేశంపై గణనీయమైన ప్రభావాన్ని చూపించాయి. "అమెరికా ఫస్ట్" అనే నినాదంతో ముందుకు వెళ్లిన ట్రంప్ విధానాలు అంతర్జాతీయ దౌత్యంలో ఉన్న సంప్రదాయాలను కుదిపేశాయి. ఈ మార్పులు భారతదేశానికి మిత్రదేశమైన అమెరికాతో ఉన్న సంబంధాల్లో కొత్త సవాళ్లను తెచ్చిపెట్టాయి. ఒకవైపు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలపరిచినట్టు కనిపించినా, మరోవైపు అనిశ్చితి, అస్థిరతను కూడా తీసుకువచ్చాయి.**



ట్రంప్ పాలనలో భారత్%--%అమెరికా వాణిజ్య సంబంధాలు తరచూ ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. భారతదేశాన్ని "టారిఫ్ కింగ్"గా విమర్శించడం, జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్సెస్ (జీఎస్పీ) నుంచి భారత్‌ను తొలగించడం వంటి చర్యలు భారత ఎగుమతులపై ప్రతికూల ప్రభావం చూపించాయి. స్నేహపూర్వక వ్యాఖ్యల మధ్యే ఈ రకమైన కఠిన నిర?యాలు తీసుకోవడం, ట్రంప్ విదేశాంగ విధానం ఎంతవరకు లావాదేవీల పైనే ఆధారపడి ఉందో స్పష్టం చేసింది. దీని వల్ల భారతదేశం ఒక విశ్వసనీయ వాణిజ్య భాగస్వామిగా అమెరికాపై ఎంతవరకు ఆధారపడాలి అన్న ప్రశ్నలు తలెత్తాయి.

**ఇమ్మిగ్రేషన్ విషయంలో ట్రంప్ తీసుకున్న కఠిన వైఖరి భారతదేశానికి మరింత ఆందోళన కలిగించింది. హెచ్-1బీ వీసా నిబంధనలను కఠినతరం చేయడం వల్ల వేలాది మంది భారత ఐటీ నిపుణులు, నైపుణ్య ఉద్యోగులు అనిశ్చితిలో పడిపోయారు. అమెరికా కలల దేశమనే భావనకు ఈ విధానాలు విరుద్ధంగా కనిపించాయి. భారతదేశం తన నైపుణ్య మానవ వనరులను ప్రపంచానికి అందించే దేశంగా ఉన్నప్పుడు, ఈ విధానాలు ఆర్థికంగానూ, సామాజికంగానూ ప్రభావం చూపించాయి.**

ట్రంప్ అంతర్జాతీయ కూటముల పట్ల చూపిన వైఖరి కూడా భారత విదేశాంగ విధానానికి పరీక్షగా మారింది. చైనాను ఎదుర్కొనేందుకు ఇండో–పసిఫిక్ వ్యూహంలో భారత్‌కు ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ, అంతర్జాతీయ ఒప్పందాల నుంచి అకస్మాత్తుగా వైదొలగడం, మిత్రదేశాలను బహిరంగంగా విమర్శించడం వంటి చర్యలు ప్రపంచ రాజకీయాల్లో అస్థిరతను పెంచాయి. వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని పాటించే భారతదేశానికి ఇది జాగ్రత్తగా అడుగులు వేయాల్సిన పరిస్థితిని తీసుకొచ్చింది. భారత అంతర్గత విషయాలపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మరో సున్నిత అంశంగా మారాయి. కశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వం చేస్తానన్న వ్యాఖ్యలు, భారతదేశం ఎప్పటినుంచో పాటిస్తున్న ద్వైపాక్షిక విధానానికి విరుద్ధంగా ఉన్నాయి. ఇవి భారత సార్వభౌమత్వంపై అనవసర చర్చలకు దారితీశాయి. అధికారికంగా వాటిని పక్కన పెట్టినప్పటికీ, ట్రంప్ ఆకస్మిక వ్యాఖ్యలు ఎంత ప్రమాదకరమో ఇవి గుర్తు చేశాయి. అదే సమయంలో, భారతీయ వలసవాసుల్లో ట్రంప్‌కు ఉన్న ఆదరణ, భారత్%--%అమెరికా నేతల మధ్య జరిగిన భారీ సభలు దౌత్యాన్ని ఒక ప్రదర్శనగా మార్చినట్టు కనిపించాయి. అయితే వ్యక్తిగత సాన్నిహిత్యం విధానపరమైన స్థిరత్వానికి ప్రత్యామ్నాయం కాదన్న సత్యాన్ని భారత్ గ్రహించాల్సి వచ్చింది. అంతర్జాతీయ సంబంధాల్లో వ్యక్తుల కంటే వ్యవస్థలే ముఖ్యమని ఈ అనుభవం బోధించింది. ట్రంప్ రాజకీయ ప్రభావం ఇప్పటికీ అమెరికా రాజకీయాల్లో కొనసాగుతున్న నేపథ్యంలో, భవిష్యత్ అమెరికా విధానాలు భారతదేశంపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది గమనించాల్సిన అవసరం ఉంది. వాణిజ్యం, వలస విధానాలు, భద్రతా వ్యూహాలు వంటి అంశాల్లో అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. అందుకే భారతదేశం భావోద్వేగాలకు లోనుకాకుండా, జాతీయ ప్రయోజనాల ఆధారంగా, దీర్ఘకాలిక ద ృష్టితో తన విదేశాంగ విధానాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. డొనాల్డ్ ట్రంప్ కాలం భారతదేశానికి ఒక ముఖ్యమైన పాఠం నేర్పింది. అంతర్జాతీయ రాజకీయాల్లో వ్యక్తుల కంటే విధానాలపై ఆధారపడటం, ఒకే దేశంపై?ముగా ఆధారపడకుండా బహుళ దౌత్య సంబంధాలను బలపరచడం ఎంత కీలకమో ఈ అనుభవం స్పష్టం చేసింది. మారుతున్న ప్రపంచ రాజకీయ పరిస్థితుల్లో భారతదేశం తన స్వతంత్రతను, స్థిరత్వాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగితేనే, ఇటువంటి అనిశ్చితులకు ధీటుగా నిలబడగలదు.

# ఉగ్రవాదం: మానవత్వానికి ముప్పు, ప్రపంచ శాంతికి నిరంతర సవాలు

**ఉగ్రవాదం అనేది ఒక దేశానికో, ఒక ప్రాంతానికో పరిమితమైన సమస్య కాదు; అది మానవ సమాజానికే విసిరిన సవాలు. భయాన్ని ఆయుధంగా ఉపయోగించి రాజకీయ, మత, వాద లక్ష్యాలను సాధించాలనే ఉద్దేశంతో నిరపరాధులపై హింసను ప్రదర్శించడం ఉగ్రవాదం యొక్క అసలు స్వరూపం. బాంబు పేలుళ్లు, కాల్పులు, అపహరణలు, ఆత్మాహుతి దాడులు వంటి పద్ధతుల ద్వారా సమాజంలో అస్థిరత సృష్టించడం, ప్రభుత్వాలను ఒత్తిడికి గురిచేయడం, ప్రజలలో భయం నింపడం ఈ చర్యల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశాలు. ఒకప్పుడు సరిహద్దు ప్రాంతాల్లో మాత్రమే కనిపించిన ఈ సమస్య, గ్లోబలైజేషన్ మరియు సాంకేతిక విప్లవం కారణంగా ప్రపంచవ్యాప్తంగా వ్యాపించింది. ఉగ్రవాదం వల్ల కలిగే ప్రాణనష్టం మాత్రమే కాదు, ఆర్థిక, సామాజిక, మానసిక నష్టాలు కూడా తీవ్రంగా ఉంటాయి.**

భారతదేశం వంటి వైవిధ్యభరిత దేశం ఉగ్రవాదాన్ని ఎన్నో దశాబ్దాలుగా ఎదుర్కొంటోంది. పంజాబ్‌లో ఒకప్పుడు తీవ్రవాదం, ఈశాన్య రాష్ట్రాల్లో విభజనవాద హింస, జమ్మూకశ్మీర్‌లో సరిహద్దు ప్రేరేపిత దాడులు, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అంతర్గత సాయుధ పోరాటంఇవి అన్నీ భిన్న రూపాల్లో కనిపించినా మూలస్వరూపం ఒకటే. దేశ సమగ్రతను దెబ్బతీయడం, ప్రజాస్వామ్య వ్యవస్థపై అనుమానం కలిగించడం, అభివృద్ధిని అడ్డుకోవడం. ప్రపంచస్థాయిలో కూడా అమెరికాలో జరిగిన 9/11 దాడులు, మధ్యప్రాచ్యంలో ఐసిస్ ఉగ్రకాండలు, యూరప్‌లో జరిగిన పేలుళ్లు వంటి సంఘటనలు ప్రపంచాన్ని కుదిపేశాయి. ఇవన్నీ ఒక విషయం స్పష్టం చేస్తున్నాయిఉగ్రవాదం సరిహద్దులు గుర్తించదు.

ఉగ్రవాదం పుట్టుకకు అనేక కారణాలు ఉంటాయి. రాజకీయ అన్యాయం, సామాజిక అసమానతలు, మత మూఢనమ్మకాలు, విదేశీ ప్రేరణలు, ఆర్థిక వెనుకబాటు, నిరుద్యోగం వంటి అంశాలు యువతను దారితప్పించే అవకాశం కల్పిస్తాయి. అయితే ఏ కారణం చెప్పినా నిరపరాధులపై హింసకు సమర్థన ఉండదు. కొందరు ఉగ్రవాద సంస్థలు మతాన్ని వక్రీకరించి యువతలో ద్వేషాన్ని నింపుతాయి. మరికొందరు సామాజిక అన్యాయాలను అస్త్రంగా ఉపయోగించి హింసను న్యాయబద్ధం చేయాలనుకుంటారు.



వాస్తవానికి హింసతో సమస్యలు పరిష్కరించబడవు; అవి మరింత సంక్లిష్టమవుతాయి.

సాంకేతిక పరిజ్ఞానం ఉగ్రవాదానికి ఒకవైపు సవాలు అయితే మరోవైపు అవకాశంగా మారింది. సోషల్ మీడియా, గుప్త సంకేత వ్యవస్థలు, డార్క్ వెబ్ వంటి వేదికల ద్వారా ఉగ్రవాద సంస్థలు సభ్యులను ఆకర్షించడం, నిధులు సమీకరించడం, ప్రచారం చేయడం సులభమైంది. సైబర్ ఉగ్రవాదం అనే కొత్త రూపం కూడా వెలుగులోకి వచ్చింది. విద్యుత్ వ్యవస్థలు, బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లు, ప్రభుత్వ డేటాబేస్‌లపై దాడులు చేసి దేశ భద్రతను దెబ్బతీయడం ఒక కొత్త ప్రమాదం. అందువల్ల భద్రతా వ్యవస్థలు కూడా సాంకేతికంగా ముందుండాల్సిన అవసరం ఉంది.

ఉగ్రవాదాన్ని అణచివేయడంలో భద్రతా బలగాల పాత్ర కీలకం. నిఘా వ్యవస్థ బలోపేతం, అంతర్రాష్ట్ర మరియు అంతర్జాతీయ సమాచార మార్పిడి, సరిహద్దు పర్యవేక్షణ, వేగవంతమైన ప్రతిస్పందన దళాలు వంటి చర్యలు అవసరం. కానీ కేవలం సైనిక చర్యలతో సమస్య పూర్తిగా పరిష్కారమవదు. మూలకారణాలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. విద్య, ఉపాధి అవకాశాలు, సమాన అభివృద్ధి, సామాజిక న్యాయం వంటి అంశాలు యువతను హింసా మార్గం నుంచి దూరంగా ఉంచగలవు. మత సామరస్యం, పరస్పర గౌరవం, సంభాషణల ద్వారా అపోహలను తొలగించాలి.

ప్రజాస్వామ్యంలో భద్రతా చర్యలు తీసుకుంటూనే పౌర హక్కులను కాపాడడం కూడా అంతే ముఖ్యం. ఉగ్రవాదాన్ని అరికట్టాలనే పేరుతో అమాయకులపై అన్యాయం జరగకూడదు. చట్టాలు కఠినంగా ఉండాలి, కానీ అమలు న్యాయబద్ధంగా ఉండాలి. ఒక సమాజాన్ని మొత్తం అనుమానంతో చూడడం వలన విభజనలు మరింత పెరుగుతాయి. ఉగ్రవాదం లక్ష్యమే సమాజంలో అవిశ్వాసం సృష్టించడం; అందుకే ఐక్యతే దీని ఎదురుదెబ్బ.

**ప్రపంచ దేశాలు కలిసి పనిచేయకపోతే ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించడం కష్టం. నిధుల ప్రవాహాన్ని అడ్డుకోవడం, ఆయుధాల సరఫరాను నియంత్రించడం, ఆశ్రయం కల్పించే దేశాలపై ఒత్తిడి తేవడం వంటి చర్యలు అంతర్జాతీయ స్థాయిలో అవసరం. ఐక్యరాజ్యసమితి వంటి వేదికల ద్వారా సమన్వయం పెంచాలి. ఉగ్రవాదం ఒక దేశ సమస్య కాదు; అది మానవాళి సమస్య.**

ముఖ్యంగా యువతను రక్షించాల్సిన అవసరం ఉంది. తీవ్రవాద ప్రచారానికి గురికాకుండా విమర్శనాత్మక ఆలోచన, శాంతి విలువలు, మానవ హక్కుల పట్ల గౌరవం పెంపొందించే విద్య అవసరం. కుటుంబం, పాఠశాల, సమాజం కలిసి యువతలో సహనం, సహజీవనం, దేశభక్తి విలువలను నాటాలి. అభివృద్ధి ఫలాలు అందరికీ చేరినప్పుడు అసంతృప్తి తగ్గుతుంది; అసంతృప్తి తగ్గినప్పుడు హింసకు ఆస్కారం తగ్గుతుంది.

**ఉగ్రవాదం తాత్కాలికంగా భయాన్ని కలిగించవచ్చు, కానీ అది ఎప్పటికీ శాశ్వత పరిష్కారం కాదు. చరిత్ర చెబుతున్నది ఏమిటంటే హింసా మార్గం చివరికి నాశనానికే దారి తీస్తుంది. శాంతి, సంభాషణ, సమానత్వం, న్యాయంఇవే దీర్ఘకాలిక పరిష్కారాలు. సమాజం అప్రమత్తంగా ఉండాలి, ప్రభుత్వం దృఢంగా వ్యవహరించాలి, అంతర్జాతీయ సహకారం బలపడాలి. అప్పుడు మాత్రమే ఉగ్రవాదం అనే ముప్పును తగ్గించగలుగుతాం. మానవత్వం, శాంతి, సహజీవనం విలువలను కాపాడటమే ఈ పోరాటంలో అసలైన విజయంగా నిలుస్తుంది.**

# హైప్‌ను క్రియేట్ చేస్తున్న స్పిరిట్

## బీజీఎం పనులు దాదాపు 70 శాతం పూర్తి



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రం 'స్పిరిట్'. ఈ మూవీ ఇంకా సెట్స్‌పైకి వెళ్లకముందే భారీ స్థాయిలో హైప్‌ను క్రియేట్ చేస్తోంది. తాజాగా ఈ ప్రాజెక్ట్‌పై సందీప్ రెడ్డి స్వయంగా ఒక షాకింగ్ అప్‌డేట్‌ను పంచుకున్నారు. ఓ టీవీ కార్యక్రమంలో పాల్గొన్న సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. స్పిరిట్ మూవీ షూటింగ్ త్వరలో మొదలవుతుందన్నారు. ఇప్పటికే బీజీఎం పనులు దాదాపు 70 శాతం పూర్తయ్యాయి. యానిమల్ –టైంలో మాదిరిగానే ముందుగా మ్యూజిక్ వర్క్ పూర్తిచేస్తే, సీన్ అవుట్‌పుట్ ఎలా వస్తుందో ముందే అర్థమవుతుంది. ఇది –టైమ్, ప్రొడక్షన్ బడ్జెట్ రెండింటినీ ఆదా చేస్తుంది అని అన్నారు. ఇక ప్రభాస్ గురించి మాట్లాడుతూ.. ప్రభాస్ చాలా నిజాయితీగలవాడు, కోపం లేకుండా పని చేసే వ్యక్తి. స్టార్ అన్న అహంకారం ఆయనలో ఏమాత్రం లేదు. నేను ఊహించిన దానికన్నా ఎక్కువగా ఆయన ఈ సినిమాకు సహకరిస్తున్నారు. త్వరలోనే సెట్స్‌పైకి వస్తాం అని అన్నారు. 'బాహుబలి 2' ఇంటర్వెల్ సీన్ చూసిన తర్వాత తనకు 'అర్జున్ రెడ్డి' విషయంలో భయం వేసిందని దర్శకుడు సందీప్ వంగా అన్నారు. రామ్ గోపాల్ వర్మ గురించి సందీప్ మాట్లాడుతూ.. ఆయన ఎన్నో విషయాల్లో నాకు గురువు. ఆయన చిత్రాలు చూసి తెలియని విషయాలు నేర్చుకున్నా. 'సత్య' సినిమా 50, 60 సార్లు చూశాను. అది చూసే ఎడిటింగ్ నేర్చుకున్నా అని చెప్పారు. నేను ఇప్పటి వరకూ చూసిన సినిమాల్లో 'బాహుబలి 2' ఇంటర్వెల్ హైలైట్. దానికి మించిన ఇంటర్వెల్ సీన్ ఇప్పటి వరకూ లేదు. అది చూసి నా స్టూడియోకు వచ్చి 'అర్జున్ రెడ్డి' ఇంటర్వెల్ సీన్ చూశాను. ప్రేక్షకులకు నచ్చుతుందా లేదా అని ఒక్క నిమిషం భయం వేసింది. ఇంటర్వెల్ కూడా గొప్పగా ఉండాలని రాజమౌళి నిరూపించారు. 'అర్జున్‌రెడ్డి' –ట్రైలర్ విడుదలయ్యాక ప్రేక్షకుల స్పందన చూసి నాకు ధైర్యం వచ్చిందని చెప్పారు. ఇక 'స్పిరిట్' సినిమాలో ప్రభాస్ రెండు విభిన్న పాత్రల్లో కనిపించ నున్నారని సమాచారం. ఇందులో ఒక పాత్ర పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ కాగా, రెండోది ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో మాఫియా డాన్. ఈ మాస్ మిక్స్ క్యారెక్టర్స్‌తో సినిమా హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనుంది. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి హిట్స్ ఇచ్చిన సందీప్ నుంచి ఇది మరో బిగ్ బ్లాక్ బస్టర్ అవుతుందని అభిమానులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ ఇతర సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. మారుతి దర్శకత్వంలో చేస్తున్న ది రాజా సాబ్ చిత్రం 2026 సంక్రాంతికి రిలీజ్ కానుంది. మరోవైపు ఫౌజీ (హను రాఘవపూడి డైరెక్షన్‌లో) చిత్ర షూటింగ్ శరవేగంగా సాగుతోంది. 'స్పిరిట్' కోసం సందీప్ రెడ్డి పెట్టిన కండిషన్ ప్రకారం, ప్రాజెక్ట్ ప్రారంభమైన తర్వాత ప్రభాస్ వేరే సినిమా చేయకూడదు. ప్రభాస్ దీనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు–సమాచారం. అందుకే షూటింగ్ షెడ్యూల్స్ అందుకు



## గ్లోబల్ చార్ట్స్‌లో 9 దేశాల్లో ట్రెండింగ్‌లో

# ఆయా షేర్ సాంగ్

**నేచురల్ స్టార్ నాని మోస్ట్ ఎవైటెడ్ ప్రాజెక్ట్ ది పారడైస్ ఫస్ట్ సింగిల్ ఆయా షేర్ వరల్డ్ వైడ్ సంచలనం సృష్టించింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. విడుదలైన కొద్దిసేపటికే ఆయా షేర్ ప్రపంచవ్యాప్తంగా ట్రెండ్ అవుతూ భారీ రెస్పాన్స్ అందుకుంది. ఈ పాట యూట్యూబ్ గ్లోబల్ చార్ట్స్‌లో 9 దేశాల్లో ట్రెండింగ్‌లో నిలిచింది. భారత్, యూఏఈలో నంబర్ 1 స్థానాన్ని దక్కించుకోగా, యూకే, ఆస్ట్రేలియా, సింగపూర్, కెనడా, సౌదీ అరేబియా, అమెరికా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో కూడా అద్భుతమైన ర్యాంకులు సాధించింది. ఒక తెలుగు పాటకు ఈ స్థాయి అంతర్జాతీయ ఆదరణ రావడం విశేషం. ఈ సాంగ్ లో రా ఎనర్జీ, నాని స్క్రీన్ ప్రెజెన్స్ అదిరిపోయింది. ఆయన చేసిన ఐకానిక్ హుక్ స్టెప్ ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్‌లలో ట్రెండ్ అవుతూంది.**




# రామ్‌చరణ్‌తో జోడీ?

హీరో రామ్‌చరణ్‌కి జోడీగా బాలీవుడ్ హీరోయిన్ కృతీ సనన్ నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. ప్రస్తుతం బుచ్చిబాబు దర్శకత్వంలో 'పెద్ది' అనే పాన్‌ఇండియా సినిమాలో నటిస్తున్నారు రామ్‌చరణ్. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. 2026 మార్చి 27న ఈ చిత్రం విడుదల కానున్న సంగతి తెలిసిందే. 'పెద్ది' తర్వాత సుకుమార్ దర్శకత్వంలో నటించనున్నారు రామ్‌చరణ్. 'ఆర్‌సీ 17' అన్నది వర్కింగ్ టైటిల్. 'రంగస్థలం'(2018) వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత రామ్‌చరణ్%–%సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమా ఇది. ప్రస్తుతం ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు సుకుమార్. 'పెద్ది' షూటింగ్ పూర్తయిన వెంటనే ఏమాత్రం విరామం లేకుండా 'ఆర్‌సీ 17'ని సెట్స్‌కి తీసుకెళ్లనున్నారట రామ్‌చరణ్%–% సుకుమార్. అయితే ఈ సినిమాలో హీరోయిన్ ఎవరు? అనే విషయంపై ఇప్పటి వరకూ ఎలాంటి ప్రకటన రాలేదు.అయితే రామ్‌చరణ్‌కి జోడీగా కృతీసనన్‌ని తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారట సుకుమార్. మహేశ్ బాబు హీరోగా నటించిన 'వన్: నేనొక్కడినే' సినిమా ద్వారా కృతీసనన్‌ని తెలుగుకి పరిచయం చేశారు సుకుమార్. ఆ తర్వాత 'దోచెయ్, ఆదిపురుష్' వంటి తెలుగు సినిమాల్లో నటించారు కృతీసనన్. ప్రస్తుతం బాలీవుడ్‌లో బిజీగా ఉన్న ఈ బ్యూటీని 'ఆర్‌సీ 17' ద్వారా మరోసారి టాలీవుడ్‌కి తీసుకురానున్నారట సుకుమార్. మరి రామ్‌చరణ్‌కి జోడీగా కృతీసనన్ నటిస్తారా? లేదా? అనే విషయం తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాలి.

# ట్రైలర్ రెడీ



రిషబ్ శెట్టి హీరోగా నటించి, స్వీయ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కాంతార: చాప్టర్1'. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించగా, గుల్షన్ దేవయ్య, జయరాం ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. హొంబలే ఫిలింస్ నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ను రేపు (సెప్టెంబరు 22) రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ వెల్లడించి, ఓ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. కాగా ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను ప్రభాస్, హిందీ ట్రైలర్‌ను హృతిక్ రోషన్, తమిళ ట్రైలర్‌ను శివకార్తికేయన్, మలయాలం ట్రైలర్‌ను పృథ్వీరాజ్ సుకు మారన్‌లు డిజిటల్‌గా విడుదల చేయనున్నారు. "ఈ సినిమా కోసం 3వేలమంది ప్రజలు, 500 మంది యోధులు పాల్గొన్న ఓ భారీ యుద్ధ సన్నివేశాన్ని తెరకెక్కించాం. ఇందుకోసం 25 ఎకరాల స్థలంలో ఓ పట్టణాన్ని నిర్మించి, దాదాపు 50 రోజుల పాటు షూటింగ్ చేశాం. భారతీయ సినిమా చరిత్రలోనే అతి పెద్ద సన్నివేశాల్లో ఈ యుద్ధ సన్నివేశం ఒకటిగా నిలుస్తుంది. 'కాంతార' ('కాంతార' సినిమాకు ప్రీక్వెల్‌గా 'కాంతార: ఛాప్టర్ 1' చిత్రం తెరకెక్కింది) విజయాన్ని కొనసాగించడంలో హొంబలే ఫిలింస్ రాజీ పడటం లేదు. ఆడియన్స్‌కు థియేటర్స్‌లో గొప్ప అనుభూతిని ఇచ్చేలా ఈ సినిమా ఉంటుంది" అని చిత్ర యూనిట్ పేర్కొంది. కన్నడతో పాటు హిందీ, తెలుగు, మలయాళ, తమిళ, బెంగాలీ, ఇంగ్లిష్ భాషల్లో 'కాంతార: ఛాప్టర్ 1' చిత్రం అక్టోబరు 2న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది.



# సంబరాలు వాయిదా

సాయి దుర్గాతేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. ఈ చిత్రంలో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తున్నారు. రోహిత్ కేపీ దర్శకత్వంలో కె. నిరంజన్‌రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఈ నెల 25న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ గతంలో ప్రకటించారు. కానీ 'సంబరాల ఏటిగట్టు' సినిమా రిలీజ్‌ను వాయిదా వేశామని, త్వరలోనే కొత్త విడుదల తేదీ ప్రకటిస్తామని శనివారం ఓ నోట్‌ను విడుదల చేశారు మేకర్స్. "సినీ కార్మికుల సమ్మె, కీలకమైన సీజీ వర్క్ పెండింగ్... వంటి కారణాల వల్ల మా సినిమా రిలీజ్‌ను వాయిదా వేస్తున్నాం. క్వాలిటీ పరంగా రాజీ పడాలనుకోవడం లేదు" అని చిత్రయూనిట్ పేర్కొంది.

PUBLISHED BY **G.KALPANA** AND **PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS**, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254, MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI, TELANGANA, EDITOR : **G.DAYAKAR REDDY**, **RNI :TELTEL/2022/83927**, PHONE NUMBER 9908293393,040- 45046154